సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 12-7-2024 15/-



# మార్పు మొదలయ్యిందా?






సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక
**GEETURAI WEEKLY**
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 28 హైదరాబాద్
శుక్రవారం 12 జులై 2024 రూ.15-00
5 ముహర్రమ్ 1446 హిజ్రీ

**తొలిగీటు**

'ఎవరి హృదయాల్లోనైతే సాటి మనుషుల పట్ల కారుణ్యం ఉండదో, ఇతరుల పట్ల సానుభూతి ఉండదో, అలాంటి వారిని అల్లాహ్ తన ప్రత్యేక కరుణకు దూరంగా ఉంచుతాడు.'

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**

కథ



28

**పండుగలు కొత్త కొత్త పోకడలు**

## లోపల...

| | |
|---|---|
| రెండు విషాదాలు ...... | 04 |
| మార్పు మొదలయ్యిందా? ...... | 05 |
| క్రీడాధన శ్రేష్ఠుడు – 37 ...... | 10 |
| చరితార్థులు-2 : మౌల్వీ సయ్యద్ ఖుర్షీద్ హుస్సైన్ ...... | 11 |
| సాటిలేని వాడు సర్వ సృష్టికర్త ...... | 12 |
| పరిమితులు విధించిన ప్రజాతీర్పు– పరిణితి చెందిన రాహుల్ ...... | 16 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| క్షమించేద్దాం! ...... | 22 |
| ముహర్రమ్ ప్రాముఖ్యత ...... | 24 |
| ముహర్రం అల్లాహ్ మాసం (సందేహాలు-సమాధానాలు)-2 ...... | 26 |
| నిజామీ గజళ్లు ...... | 30 |
| సమాధి పిలుస్తోంది ...... | 33 |

**జై సంవిధాన్ .!**




పార్లమెంటు సాక్షిగా
అద్రిందోయ్ ప్రసంగం
రాహుల్ దూకుడుకు
'పరివార్' ఆగమాగం!
రాజ్యాంగ్యం చేతబట్టి
చెరిగినాడు నిప్పులు
మన్‌మానీ సాగదింక
ఉడకవులే పప్పులు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# రెండు విషాదాలు

**ఉత్తరప్రదేశ్** హాత్రస్‌లో భోలే బాబా ప్రవచనం వినడానికి వచ్చిన జనం తొక్కిసలాటలో 121 మంది మరణించిన సంఘటన దిగ్భ్రాంతికరమైనది. హాత్రస్ పేరు వినగానే అక్కడ జరిగిన సామూహిక అత్యాచారం సంఘటన కూడా చాలా మందికి గుర్తొస్తుంది. ఇప్పుడు అదే హాత్రస్‌లో అనేకమంది భోలే బాబా ప్రవచనం వినడానికి వచ్చి తొక్కిసలాటలో మరణించిన విషాదం చోటుచేసుకుంది.

మరో విషాదం దక్షిణాదిన జరిగింది. తమిళనాడులోని కళ్లకురిచిలో కల్తీ సారా తాగి 65 మంది మరణించారు. ఇంతకు ముందు కూడా కళ్లకురిచిలో 45 మంది కల్తీ సారా వల్ల మరణించారు.

ఈ రెండు విషాదాలు సమాజం ఆలోచించవలసిన తీవ్ర సమస్యలేమిటో చాటి చెబుతున్నాయి. మద్యపాన వ్యసనం వల్ల ఎలాంటి దారుణాలు చోటు చేసుకుంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తమిళనాడులో విషాదానికి కారణం ఈ వ్యసనమే. ఈ వ్యసనాన్ని సమూలంగా నిర్మూలించడానికి తగిన చర్యలు తీసుకోవాలి.

హాత్రస్‌లో జరిగిన విషాదం వేరు. భోలే బాబా ప్రవచనాలు విని సాంత్వన పొందడానికి ప్రజలు అక్కడికి వెళ్ళారు. చాలా పెద్ద సంఖ్యలో వెళ్ళారు. ఇప్పటి వరకు అందిన వార్తలను బట్టి బాబా పాదధూళి నుదుటికి పూసుకుంటే శుభం కలుగుతుందని ధూళి కోసం పోటీపడడం వల్ల తొక్కిసలాట జరిగినట్లు తెలుస్తోంది.

ఈ విషాదానికి కారణం సరయిన ఏర్పాట్లు లేకపోవడం అని చెబుతున్నారు. ఇంత పెద్ద జనసమూహం పోగవుతుంటే పోలీసులు ఎలా అనుమతించారన్న ప్రశ్నలు కొందరడుగుతున్నారు. కాని పోలీసులు అక్కడ ఏం చేయగలరు? ఈ మతకార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కాకుండా అడ్డుకుంటే హిందువుల మతకార్యక్రమాలను అడ్డుకుంటున్నారన్న విమర్శ వస్తుంది. రెండు లక్షలకు పైబడిన సంఖ్యలో జనం గుమికూడిన తర్వాత వారిని అదుపు చేయడం అనేది ఏ పోలీసు బలగానికైనా అంత సులభం కాదు.

అన్నింటికన్నా ముఖ్యమైనది నాన్ బయోలాజికల్ అనే నమ్మకం చాలా రకాలుగా సమాజంలో పనిచేస్తుంది. 80 కోట్ల మంది రేషన్ బియ్యంపై ఆధారపడిన పరిస్థితులున్నప్పుడు, ప్రజారోగ్యానికి ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ నామమాత్రమైనప్పుడు, నిరుద్యోగం తీవ్రస్థాయికి చేరుకున్నప్పుడు కష్టాల్లో, రోగాల్లో, ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న వారికి బాబాలు స్వామీలే రక్షగా కనిపిస్తుంటారు. తనలాంటి ఒక మామూలు మనిషి మహత్యాలతో సమస్యలు పరిష్కరించగలడనే విశ్వాసాన్ని మనిషి వదుల్చుకోకపోతే మానవ ఔన్నత్యమే దెబ్బతింటుంది. ఇలాంటి విశ్వాసం కూడా ఒక వ్యసనం కన్నా తక్కువేమీ కాదు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం రావాలి. మనిషి స్వయంగా ప్రత్యక్షంగా సృష్టికర్తను వేడుకుంటే, అన్నీ వినేవాడు, అన్నీ చూసేవాడు అయిన విశ్వ ప్రభువు తప్పక ప్రతి మనిషి మాటను వింటాడనే నమ్మకం పెరగాలి. తనలాంటి మరో మనిషికి ప్రత్యేక మహిమలు ఏవీ ఉండవని, మనుషులందరూ సమానమేనన్న నమ్మకాన్ని సమాజంలో పెంచాలి.

**కవరు కథనం** | **అబ్దుల్ వాహెద్**



# మార్పు మొదలయ్యిందా?

**ఎట్టకేలకు రాహుల్ గాంధీ** ముస్లిముల గురించి మాట్లాడారు. భారత్ జోడో యాత్రలో కాని, ఎన్నికల ప్రచారంలో కాని ఎన్నడూ ముస్లిములు ఎదుర్కొంటున్న వివక్ష, హింస, మూక దాడులపై ఆయన పెదవి విప్పిన వార్త ఏదీ నేను చదవలేదు. రాహుల్ గాంధీ గురించి కాని, కాంగ్రెసు పార్టీ గురించి కాని చాలా సందర్భాల్లో చాలా మంది విశ్లేషకులు, మేధావులు, పాత్రికేయులు కూడా ఈ ప్రశ్న వేశారు. సాఫ్ట్ హిందుత్వ రాజకీయాలు నడుపుతున్నారని, ముస్లిముల గురించి మాట్లాడితే హిందువులకు కోపం వచ్చి హిందువుల ఓట్లు దొరకవు కాబట్టి ముస్లిముల గురించి మాట్లాడే రిస్కు తీసుకోవడం లేదని ఇలా చాలా రకాల వివరణలు, విశ్లేషణలు వచ్చాయి.

విచిత్రమేమిటంటే, ముస్లిములపై బురదజల్లడమే ఎన్నికల ప్రచారంగా కొనసాగించిన బీజేపీకి ఇలాంటి సంకోచాలు లేవు. ముస్లిములకు రిజర్వేషన్లు ఇచ్చేదే లేదని, కర్నాటకలో రిజర్వేషన్లపై యాగి చేసిన బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం తెలుగుదేశం విషయంలో నోరు విప్పదు. అయినా బీజేపీకి హిందువుల ఓట్లు కోల్పోతామన్న భయం ఉండదు. కాని కాంగ్రెసు లేదా సెక్యులర్ పార్టీలుగా చెప్పుకునే పార్టీలకు మాత్రం ఈ భయం వదలదు. భారత రాజకీయాల్లో మారిన ఈ ముఖచిత్రం చాలా రోజులుగా మసకబారలేదు.

కాని ఇప్పుడు పరిస్థితి మారుతుందా? లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రతిపక్షనాయకుని హోదాలో చేసిన ప్రసంగం ఈ మార్పును చాలా కోణాల్లో చూపించింది. మైనారిటీలపై, ముఖ్యంగా ముస్లిములపై విద్వేష ప్రచారాన్ని, హింసా రాజకీయాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ జమీఅతె ఉలమాయే హింద్ ఆయన ప్రసంగాన్ని ప్రశంసించడమే కాదు, మిగిలిన ప్రతిపక్షాలు కూడా ఈ సమస్యపై ప్రతిస్పందించాలని జమీఅత్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదనీ అన్నారు.

రాహుల్ గాంధీ సూటిగా బీజేపీని ఈ విషయంలో ప్రశ్నించారు. హిందూధర్మంలో హింసకు తావులేదని చెబుతూ, హిందువులుగా చెప్పుకునే మీరు విద్వేషం హింసల రాజకీయాలే నడుపుతున్నారని, మీరసలు హిందువులే కాదంటూ నిర్భయంగా మోడీని, బీజేపీని, ఆరెస్సెస్‌ను నిందించారు. ఈ వ్యాఖ్యల తర్వాత సహజంగానే ప్రధానమంత్రితో సహా పాలకపార్టీ నేతలు, మంత్రులు తీవ్రస్థాయిలో ప్రతిస్పందించారు. రాహుల్ గాంధీ పూర్తి హిందూ సమాజాన్ని నిందించారంటూ వక్రప్రచారం చేయడానికి పూను కున్నారు. కాని బీజేపీ ఐటి సెల్ అబద్ధాల ప్రచారాన్ని దశాబ్ద కాలంగా చూస్తూ వచ్చిన ప్రజలు ఈ అబద్ధాలను నమ్మడానికి సిద్ధంగా లేరు. అప్పటికప్పుడు రాహుల్ గాంధీ ఈ ఆరోపణను ఖండిస్తూ మోడీ అంటే పూర్తి హిందూ సమాజం కాదని, బీజేపీ అంటే పూర్తి

హిందూ సమాజం కాదని, ఆరెస్సెస్ అంటే పూర్తి హిందూ సమాజం కాదని, ఈ గుత్తాధిపత్యాల రాజకీయాలు చెల్లవని ముఖం మీద అప్పటికప్పుడే చెప్పారు.

నిస్సందేహంగా దీనిని పెద్ద మార్పుగానే భావించాలి. ఎందుకంటే, మతభావాలు గాయపడతాయని భయపడి ఈ విషయంలో బీజేపీ మతరాజకీయాలను విమర్శించడానికి వెనుకాడే ప్రతిపక్షాలు ఇప్పుడు సూటిగా ప్రశ్నిస్తున్నాయి. బీజేపీ హిందూ రాజకీయాల అసలు స్వరూపాన్ని ప్రజలకు చూపించడానికి ప్రయత్నం చేస్తున్నాయి.

ఈ మార్పు వల్ల ఒక ఫలితం ఏమిటంటే, ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయకుండా ప్రతిపక్షాలకు అధిక సీట్లు వచ్చేలా ముస్లిములే చేశారన్న అక్కసుతో ముస్లిములపై దాడులు పెరగవచ్చని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ విశ్లేషణ నిజమే అన్నట్లుగా కొన్ని మాబ్ లించింగ్ వార్తలు కూడా వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ముస్లిములపై బుల్డోజర్ చర్యలు మరింత ఎక్కువ చేయవచ్చనే భయాలు కూడా ఉన్నాయి.

గమనించవలసిన విషయమేమిటంటే, రాహుల్ గాంధీ తన ప్రసంగంలో హిందూ ధర్మంలో హింసాద్వేషాలకు తావు లేదని స్పష్టంగా చెప్పిన మాటలున్నాయి. అలాగే హిందువులుగా చెప్పుకుంటూ (మోడీ, బీజేపీ, ఆరెస్సెస్) ఎల్లప్పుడు హింసాద్వేషాలు, అబద్ధాల రాజకీయాలే నడుపుతున్నారని విమర్శించిన కొన్ని గంటల్లోనే ఆయన మాటలను నిజం చేస్తూ భజరంగ్ దళ్ వంటి సంస్థలు రోడ్లపైకి వచ్చి వీరంగాలు వేసి, విధ్వంసాలు సృష్టించి, రాహుల్ గాంధీ చెప్పింది నిజమే అని ప్రజలు మరింత బలంగా నమ్మేలా చేశాయి.

ఏది ఏమైనా లోక్ సభలో రాహుల్ గాంధీ చేసిన ఈ ప్రసంగం పార్లమెంటు చరిత్రలో ఒక గొప్ప ప్రసంగంగా నిలిచిపోతుందని చివరకు విమర్శకులు కూడా ఒప్పుకోక తప్పలేదు. యావత్తు పాలకపక్షాన్ని కుదిపేసిన ప్రసంగం ఇది. ప్రతిపక్ష నాయకుడి ప్రసంగం మధ్యలో ప్రధాన మంత్రి కల్పించుకున్న అరుదైన సంఘటనలు చూస్తే ఈ ప్రసంగం ప్రత్యేకత ఏమిటో అర్థమవుతుంది.

రాహుల్ గాంధీ ఈ ప్రసంగంలో కూడా సాఫ్ట్ హిందూత్వ ప్రదర్శన చేశారా? అనే ప్రశ్న కూడా ముందుకు వస్తోంది. ఎందుకంటే ఆయన ప్రసంగం పరమేశ్వరుడి చిత్రాన్ని ప్రదర్శించడంతో ప్రారంభమయ్యింది. ఒక టీవీ కార్యక్రమంలో రాహుల్ ఈశ్వర్ మాట్లాడుతూ చేసిన వ్యాఖ్య గమనించదగింది. రాహుల్ గాంధీ నెహ్రూవియన్ సెక్యులరిజం నుంచి గాంధీయన్ సెక్యులరిజానికి మారినట్లు కనిపిస్తుందని, ఇది మంచి మార్పు అని అన్నాడు. రాహుల్ ఈశ్వర్ స్వయంగా మోడీ అభిమాని అన్నది మరిచిపోరాదు. పరమేశ్వరుడి చిత్రాన్ని చూపిస్తూ రాహుల్ గాంధీ చెప్పిన ముఖ్యమైన మాట, “భయపడకండి, భయపెట్టకండి” అనే నినాదం. అంతేకాదు అభయముద్ర గురించి నొక్కి చెప్పడం కూడా గమనించదగింది. రాహుల్ గాంధీ కేవలం హిందూ ధర్మంలోని తాత్విక విషయాలను మాత్రమే ప్రస్తావించలేదు, ఇస్లాం, క్రయిస్తవం, శిక్కు, బౌద్ధ, జైన ధర్మాలను కూడా ప్రస్తావించారు. తాను ఏ ఒక్క మతానికి పరిమితం కాలేదన్నది స్పష్టం చేస్తూనే ఆయన శివతత్వంపై నొక్కిచెప్పడం గమనించదగిన విషయం. ముఖ్యంగా అభయ ముద్ర గురించి చెప్పిన మాటలు మరింత గమనించదగ్గవి.

గత కొంతకాలంగా సమాజంలో పూర్తి డిస్కోర్స్ మారిపోయింది కాని, ఇంతకు ముందు శ్రీరామచంద్రుడంటే అభయముద్రలో సీతారాములు నిలబడిన చిత్రమే గుర్తుకు వచ్చేది, కాని ఇప్పుడు విల్లు ఎక్కుపెట్టిన చిత్రం గుర్తుకు వస్తోంది. డిస్కోర్స్ లో వచ్చిన ఈ మార్పును రాహుల్ గాంధీ లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తుంది. శివుడి చిత్రాన్ని ప్రదర్శించడంలోను సింబాలిక్‌గా తన వైఖరిని స్పష్టం చేయడం ఉంది. భస్మధారి, గరళకంఠుడు అయిన శివుడి మెడలో సర్పం గురించి కూడా ఆయన చెప్పారు. గడ్డుపరిస్థితులు ఎదురైనా మనిషి వాటిని అధిగమించాలని, సర్పాన్ని మెడలో వేసుకున్నట్లు నిబ్బరంగా ప్రతిఘటించాలే కాని భయపడరాదన్న సంకేతం ఇందులో ఉంది. ఈ మాటనే రాహుల్ గాంధీ పదే పదే చెప్పారు. నిజానికి పదే పదే పప్పు అంటూ మొత్తం బీజేపీ యంత్రాంగం పథకం ప్రకారం అవమానాల ప్రచారాన్ని ఉధృతంగా కొనసాగించినా నిలబడి, తట్టుకుని, ఈ స్థాయిలో ఎదురుదాడి చేయడం ప్రశంసించదగిన విషయం. నాగాభరణం గురించి చెప్పడమే కాదు, శివుడు తన ఎడమవైపున త్రిశూలాన్ని భూమిలో నాటాడని కూడా ఆయన చెప్పడం గమనించదగిన విషయం. ఇప్పుడు మనం చూస్తున్న విల్లు ఎక్కుపెట్టిన శ్రీరామచంద్రుడి చిత్రం ద్వారా ప్రచారంలోకి వచ్చే డిస్కోర్స్‌కు, అభయముద్రలో ఉండే సీతారాముల చిత్ర పటం, అభయముద్రలో ఉన్న శివుడి చిత్రపటం, వెనుక ఎడమ వైపున త్రిశూలం... ఇవన్నీ సమాజంలో తీసుకొచ్చే డిస్కోర్స్ ఈ రెంటి మధ్య తేడా మనం అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. ఈ తేడానే రాహుల్ గాంధీ తన ప్రసంగంలో చాలా సరళమైన భాషలో ప్రజలకు చెప్పేశారు. అందుకే పాలకపార్టీలో కలవరం ప్రారంభమయ్యింది. ఎవరు నిజమైన హిందువులు

అనే చర్చకు ఇది దారితీస్తుంది. ఈ చర్చ బీజేపీ రాజకీయాలకు గొడ్డలిపెట్టయ్యే చర్చ. రాహుల్ గాంధీ వ్యూహాత్మకంగానే బీజేపి అత్యంత బలంగా ఉన్న క్షేత్రంలోకి అడుగుపెట్టి సవాలు చేశారు. మీరు హిందువులు కాదంటూ సూటిగా చెప్పిన మాటలు, అసలు హిందు ధర్మం ఇదంటూ చెప్పిన మాటలు, అసలు భారతీయత ఇదేనంటు చెప్పిన మాటలు చాలా మందిలో ఆలోచనలు రేకెత్తించాయి. అందువల్లనే ఆయన ప్రసంగంలోని చాలా భాగాన్ని తొలగించేశారు. కాని డిజిటల్ యుగంలో ప్రసంగంలోని భాగాలను తొలగించడానికి పెద్ద ప్రాముఖ్యం లేదు. చాలా మందికి ఈ ప్రసంగం పూర్తిగా అందుబాటులో ఉంది.

ధార్మికత, తాత్వికతలతో ప్రారంభమైన ఈ ప్రసంగంలో గత పదేళ్ళ చిట్టాను తెరిచి చూపించారు. క్లుప్తంగా అర్ధమయ్యేదేమంటే, భయపడేది లేదని రాహుల్ గాంధీ స్పష్టమైన సంకేతం ఇచ్చేశారు. ఈ ప్రసంగం జరుగుతున్నంత సేపు పాలకపక్షం ప్రతిస్పందన చూస్తే మార్పు లోక్ సభలో మొదలయ్యిందనే అనిపిస్తుంది. రాహుల్ గాంధీ ప్రసంగం ఆత్మరక్షణాత్మకంగా లేదు, సూటిగా దాడి చేస్తున్న ప్రసంగం ఇది. ఆయన ప్రధానిని సంబోధిస్తున్నప్పుడు కూడా మోడీజీ అనే మాటలు కాదు నరేంద్రమోడీ అంటూ సంబోధించడం కూడా ఈ వ్యూహాత్మక ఎత్తుగడలో భాగంగానే చూడాలి. మోడీ తాను బయోలాజికల్ కాదని చేసిన వ్యాఖ్యను వాడుకుని ఆయనపై దాడి చేయడం ఈ ప్రసంగంలో అంత ఉచితమైనదిగా కనిపించలేదు. విధానపరమైన, వ్యూహాత్మక ప్రసంగంలో ఇలాంటి వ్యంగ్యం అసలు విషయం నుంచి పక్కదారి పట్టిస్తుంది.

గాంధీజీ హరిజన్ పత్రికలో స్పీకర్ హోదా గురించి రాస్తూ ప్రధానమంత్రి కన్నా లోక్‌సభలో స్పీకర్ హోదా పెద్దదని అన్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీ అదే విషయాన్ని స్పీకర్‌కు గుర్తుచేసిన తీరు కూడా రాహుల్ గాంధీలో వచ్చిన మార్పునే కాదు, మొత్తం లోక్ సభ వ్యవహారాల్లో వచ్చిన మార్పుకు సూచన. స్పీకర్ తనతో కరచాలనం చేసిన తీరు, మోడీతో కరచాలనం చేసిన తీరును పోల్చుతూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు కూడా పాలకపక్షానికి మింగుడుపడేవి కావు.

ఈ సారి ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వాన్ని కాదు, ప్రతిపక్ష నేతను ఎన్నుకున్నారని ఎవరో చెప్పిన మాట నిజం. ఎందుకంటే, బ్రూట్ మెజారిటీ కాలం పోయింది. ఇప్పుడు మిత్రపక్షాల మద్దతుతో పాలించవలసిన కాలం వచ్చింది. కాని ఈ వాస్తవాన్ని ప్రధాని మోడీ అర్థం చేసుకున్నట్లు కనిపించడం లేదు. ప్రతిపక్షాలు తాడోపేడో తేల్చుకునే వైఖరిలో కనిపించాయి. దీనికి కారణం కూడా మోడీయే. స్పీకర్ విషయంలో ఓం బిర్లాకు ప్రతిపక్షాలకు సరే అన్నాయి, కాని డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షాలు ఇవ్వడం ఒక సంప్రదాయం. మోడీ మొండిగా తిరస్కరించడంతో పాలకప్రతిపక్షాల మధ్య ఇప్పుడు సయోధ్య కరువైన వాతావరణం ఏర్పడింది. ప్రధాని మోడీ ప్రసంగం కొనసాగిన రెండు గంటల పాటు ప్రతిపక్షాలు మణిపూర్ ను కాపాడాలంటూ నినాదాలిస్తూ ప్రధాని మాట్లాడకుండా చేసిన తీరు లోక్‌సభలో ముమ్ముందు ఏం జరగబోతుందో చెప్పకనే చెబుతోంది.

మోడీ తన ప్రసంగంలో రాహుల్ గాంధీ సంధించిన ప్రశ్నలకు జవాబివ్వడం కన్నా కాంగ్రెసుపై, రాహుల్‌పై ప్రతిదాడి చేయడానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. ఆయన ప్రసంగంలో కొత్త విషయమేదీ లేదు. రాహుల్ గాంధీది బాలబుద్ధీ అంటూ వ్యంగ్యంగా చెప్పడం వల్ల ఆయన సాధించేదేముంది? పప్పూ అంటూ చేసిన ఉధృత ప్రచారం వల్ల సాధించిందేమిటి? రాజ్యాంగాన్ని మార్చేస్తాం అంటూ బీజేపీ నేతలు బాహాటంగా చెప్పిన మాటలను ప్రజలు విన్నారు. అయినా రాజ్యాంగాన్ని మేమే కాపాడుతున్నాం అంటూ మోడీ చెప్పడం ద్వారా సాధించిందేమిటి? మల్లికార్జున ఖర్గే ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగసభ కాలం నుంచి రాజ్యాంగం పట్ల ఆరెస్సెస్ జనసంఘ్ ఇప్పుడు బీజేపీ వైఖరిని బట్టబయలు చేశారు. ఇవన్నీ ప్రజలు గమనించడం లేదు. ప్రతిపక్షాలు కేవలం అబద్దాలు చెబుతున్నాయని, అబద్దాల ప్రచారమే వాళ్ళ పని అని మోడీ చెప్పిన మాటలు కూడా ప్రజలు ఎలా తీసుకుంటారు? తాను అస్సలు హిందూ ముస్లిం రాజకీయాలు చేయనంటూ ఆయన చెప్పిన మాటలు టీవీలు ప్రజలు చూడలేదా? ఆ తర్వాత ఆయనే ముస్లిములకు వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారంలో ఏమేం చెప్పారో కూడా ప్రజలు వినలేదా? వికసిత భారత్, లక్షాధికారి అక్కలు (లక్పతీ దీదీ), సెమీకండక్టర్ చిప్పులు గురించి మాట్లాడారు కాని పరీక్ష పేపర్లు స్కాములు, నీట్ యుజీసీ నెట్, కూలిపోతున్న విమానాశ్రయాల టెర్మినళ్ళు, గుంతలు పడుతున్న రోడ్లు, వందేభారత్ రైళ్ళ పరిస్థితి, కొత్తగా కట్టిన అయోధ్య మందిరంలో పైకప్పు నుంచి వర్షం నీరు కారడం, హాత్రస్‌లో విషాదం, మణిపూర్ – వీటి గురించి ఆయన ఏదో ముక్తసరిగా ముగించడం తప్ప చెప్పింది ఏమీ లేదు. పైగా ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారు. కాని ఇప్పుడు ప్రతిపక్షం దాదాపు పాలకపక్షంతో సమానమైన బలంతో ఉంది. దేశంలోని సమస్యలకు అన్నింటికి కారణం నెహ్రూ అంటే నమ్మే స్థితిలో ప్రజలు కూడా లేరు. ✤

అధ్యాయం -13 - 14

37

# వ్రీడా ధన శ్రేష్ఠుడు

ఎస్.ఎమ్. మలిక్

### 3. కొన్ని సమాధానాలు

పైన పేర్కొన్న అభ్యంతరాలు, వాటి సమాధానాలు కొన్ని, ముక్తసరిగా ఇక్కడ ప్రస్తుత పరచడం భావ్యమని భావిస్తున్నాము :

వీరు, "దివ్య ఖుర్ఆన్ ఎన్నో గ్రంథాల సంచయనం. దాన్ని నీవు ఒకే గ్రంథంగా మార్చావు" అని అంటున్నారు. నిజానికి అల్లాహ్ స్వయంగా తన గ్రంథ రక్షకుడు. ఎవనికి అందులో మార్పులు చేర్పులు చేసే తాహతుందీ? దాన్ని గ్రంథస్థం చేసినవారు దాని అత్యంత విశ్వసనీయులయిన సహచర మాన్యులు. దాన్ని, విశ్వాసుల మాతృమూర్తి(ర) వద్ద ఉన్న సురక్షిత ప్రతి ఆధారంగా చేశారు. నేను సరిగ్గానే చెప్పానా?... జనం నుంచి సమాధానం, "మీరు చెప్పింది వాస్తవం."

వీరు అంటున్నారు, "నీవు ఒక నవయువకుణ్ణి, అంటే అబ్దుల్లా బిన్ ఆమిర్‌ని గవర్నర్‌గా నియమించావు" అని అంటున్నారు. నిజానికి నేను అతని, బుద్ధి వివేకాలు, ధార్మికత, ధైర్య సాహసాలు, భయభక్తులు చూసే నియమించాను. యువకుడవటం ఏ విధంగానూ లోపం కాజాలదు. నాకు పూర్వం 'షేఖైన్' (తొలి ఇద్దరు ఖలీఫాల) కాలంలోనూ ఇలా జరిగింది. ప్రవక్తశ్రీ కాలంలోనూ ఓ తార్కాణం ఉంది. ఆయన(స) మహనీయ ఉసామా(ర)ను 17 ఏళ్ల ప్రాయంలో సేనాధిపతిగా నియమించారు. ఈయన అప్పుడు ఇబ్ను ఆమిర్ కన్నా 8 ఏళ్లు చిన్న. నేనేదయినా తప్పు చెప్పానా?... వెంటనే జనం స్పందించి "మీరు సరిగ్గానే చెప్పారు" అన్నారు.

వీరు, "నీవు యుద్ధ ప్రాప్తి పూర్తిగా నీ బంధుగణానికే ఇచ్చివేశావు" అని అంటున్నారు. వీరు దీనికి ఆధారంగా అబ్దుల్లా బిన్ సఅద్‌ని సూచించారు. నిజానికి నేను యుద్ధ ప్రాప్తిలోని అయిదవ భాగం(ఖుముస్)లోనూ అయిదవ భాగమే అతనికి ఇచ్చాను. నాకు పూర్వం షేఖైన్ కాలంలోనూ ఇలాగే జరిగింది. అయినా కొందరు దీన్ని ఇష్టపడలేదని తెలిసి నేను ఇబ్ను సఅద్ నుండి ఆ మొత్తం ధనం తిరిగి తీసుకున్నాను. ఇది వాస్తవం కాదా?... అందరూ "నిజం నిజం!" అని కేకలు వేశారు.

వీరంటున్నారు, నేను నా బంధువులకే పదవులన్నీ కట్టపెట్టానని. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. నా మీద ముస్లిమ్ సముదాయం శ్రేయోభిలాషా బాధ్యత, దాని నాయకత్వ బాధ్యతల నిర్వహణా భారం కూడా ఉన్నాయి. నేను అర్హులయిన వారికే ఆయా బాధ్యతలు అప్పగించ గలను. నిరాకరించలేని యథార్థం ఏమిటంటే ఉమయ్యా సంతతిలోనే అందరిలోకెల్లా అధికంగా సమర్థ

వంతులయిన వారున్నారు. ఇదీ వాస్తవమే, బంధువులే అత్యధికంగా విశ్వసనీయులయి ఉంటారు.

అయినా నా ఈ చర్యను ఎవరయినా ఇష్ట పడకపోతే ఇతరులు అర్హులయిన వారికి ఈ బాధ్యతలు అప్పగించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. నేను చెప్పిన దానిలో ఏమయినా తప్పు ఉందా?... "సరయినదే" అన్న నినాదాలు వినవచ్చాయి.

వీరు అనే మరో మాట ఏమిటంటే, నేను నా బంధుగణం పట్ల ప్రేమ కలిగి ఉంటాను, వారికి కానుకలూ అందజేస్తుంటాను అని. నేను ఇలా చేస్తున్నానంటే జనులు సంబరపడాలి. ఇది దైవం దైవ ప్రవక్తలకు సమ్మతమయిన పని. కుర్ఆన్, ప్రవక్త సంప్రదాయాలలో బంధువుల పట్ల బాంధవ్యం బదులుగా కానుకలు, విరాళాలు ప్రసాదిస్తూ ఉండ వలసిందిగా ఆదేశించడం జరిగింది. నేను ఒక వేళ ఇలా చేస్తున్నానంటే హక్కుదారులకు వారి హక్కును అందజేస్తున్నానన్న మాట, అంతే.

ఇక ఈ అనుదానం నేను ముస్లిమ్ సముదాయం అప్పగింత సొమ్ములోనుంచి అనుగ్రహిస్తూ ఉంటే నేను నిస్సందేహంగా ఉరిశిక్షకు పాత్రుణ్ణి. నేను ఎప్పుడు ఇచ్చినా నా స్వంత సొమ్ములోనుంచే ఇచ్చాను. కనీసం నా సొమ్ములో నేను ఖర్చు చేసుకునే హక్కునయినా నా నుండి హరించకండి- నేను చెప్పేది ఏమయినా అబద్ధమా?... అక్కడ ఉన్న వారు, "ఎంత మాత్రం కాదు, మీరు నిజమే చెబుతున్నారు" అన్నారు.

ఈ సమాధానాలు ఇచ్చిన తరువాత ఆయన ఆకాశం వైపునకు తలెత్తి, "ఓ అల్లాహ్! నీకు ఎనలేని కృతజ్ఞతలు, నీ సృష్టి సమక్షంలో ఈ అశక్తుణ్ణి పరాభవం, తలవంపుల నుండి రక్షించావు. ఇకపై కూడా నన్ను విద్రోహం, అపరాధాల నుంచి రక్షించు స్వామి! ఈ మనస్సయితే చెడు వైపునకు పురికొలుపుతూనే ఉంటుంది, కాని ఎవడి నయితే దైవం కనికరిస్తాడో అతను కాపాడబడతాడు" అని వేడుకున్నారు.

ఆయన తన శత్రువుల ఎడల ఎటువంటి నిందలకో చీవాట్లకో శాపనార్థాలకో కించపరచడానికో పాల్పడలేదు. ఆ ఖలీఫా మహనీయుడు అతి దుష్ట విరోధుల నైచ్యానికి గురయి ఉన్నారు. అత్యంత సజ్జనులయిన వారి సమక్షంలో ఆ నైచ్యం నుంచి ఆయన్ని అల్లాహ్ తేజోమయ ముఖంతో బయటికి తీశాడు. అప్పుడే ఆయన దైవానికి కృతజ్ఞతలు అర్పించుకుని యూదుల శిష్యగణాన్ని సాగనంపారు.

★★★

# అధ్యాయం. 14

## 1. సబాయీలుగా యూదుల ఆగడాలు

యూదులు ఇస్లామ్ ఆవిర్భావం నుంచి దాని పట్ల తమ ఏవగింపును ప్రదర్శించడంలో ఏ మాత్రం తొణకలేదు. కుట్రలు కుతంత్రాలు వారి ప్రవృత్తిలోనే చోటు చేసుకోవడం చేత వారు తొలి నాటి నుంచి ఎన్నో విధాలుగా దాన్ని రూపుమాపాలన్న తమ పథకాలను విడనాడలేదు. ఎన్నేళ్ళు కడచినా భౌతికంగా ఏమీ చేయలేక పోయారు. అందువల్ల నైతికంగా, విశ్వాస పరంగా దెబ్బ తీయడానికి ప్రయత్నించడం మొదలెట్టారు. ఆ విధంగా ఇస్లామ్ ధర్మాన్ని, దాని వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయాలని సంకల్పించుకున్నారు.

### మరో కుతంత్రం

మదీనా నుండి తిరిగి వెళ్ళి ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా ఓ పథకం తయారు చేసుకున్నారు. మునుపటి మూడు ప్రాంతాల నుంచి, ఈజిప్టు, కూఫా, బస్రా నుంచి పెద్ద పెట్టున ఉమ్రాకు వెళ్తున్నట్టు ప్రకటించి, మునుపటి లానే మదీనాలో సమావేశమవ్వాలని అనుకున్నారు. ఆ మూడు ప్రాంతాల నుండి ఒక్కొక్క వెయ్యి మంది, నాలుగేసి బిడారాలుగా బయలుదేరారు. తరువాత మదీనాకు సమీపాన దాదాపు పాతిక మైళ్లదూరంలో మూడు ప్రాంతాల వారు ఏకత్రమయ్యారు.

ఒక విషయంలో మాత్రం వారందరికీ ఏకాభిప్రాయం కుదిరింది, అది అమీరుల్ మూ'మినీన్‌ని చంపాలన్నది! కాని ఖలీఫాగా ఎవరిని ఎంపిక చేయాలనే విషయంలో మాత్రం ఏకాభిప్రాయం కుదరలేదు. బస్రా వారు మహనీయ తల్హా(ర)ని కోరుకుంటే కూఫా వారు మహనీయ జుబైర్(ర)ని ఇష్టపడ్డారు. మరి ఈజిప్టు సబాయీలు మహనీయ అలీ(ర)ని ఖలీఫాగా ఖరారు చేశారు. మదీనాలో వాతావరణాన్ని పసిగట్టడానికి ఇబ్ను సబా తనకు విశ్వసనీయులయిన వారిని ఇద్దరిని అక్కడికి పంపాడు.

వాతావరణం సాధారణంగానే ఉండటం గమనించి వారిరువురు మహనీయులు తల్హా, జుబైర్, అలీని కలుసుకున్నారు. వారిని ఖిలాఫత్ బాధ్యతను స్వీకరించేందుకు సమాయత్త పరచడానికి ప్రయత్నం చేశారు. ఆ ఉత్తమ శీలురయిన మహనీయులు ముగ్గురూ వారికి చీవాట్లు పెట్టి తరిమివేశారు. వారు ఇబ్ను సబా వద్దకు తిరిగి వచ్చి అంతా వెల్లడించారు. ఇక ఇబ్ను సబా తన అనుయాయుల్ని అందరినీ

ఏకత్రం చేసి ఒకేసారి మదీనా నగరంలో ప్రవేశించేందుకు ఆదేశించాడు. దొమ్మిపోటు దారులంతా పెద్ద పెద్ద నినాదాలు చేసుకుంటూ ఖలీఫా ఇంటిని పైకి నలువైపులా చుట్టు ముట్టారు. ఆ పైన, తన కరవాలం ఒరలో పెట్టుకున్న వారికే ఆశ్రయం అని ప్రకటించారు.

## ఘోరమయిన అవస్థ

ప్రవక్త స్థానంలో నియమితులయిన ఖలీఫా ఇంటిని ముట్ట డించిన రాత్రి ఎవ్వరూ రక్షణకు ముందుకు రాలేక పోయారు. ముస్లిమ్ సముదాయం పైన అదొక దుఖదాయకమయిన ఘోరావస్థ. దాని ఫలితాలను ఈ సముదాయం నేటి వరకు భరిస్తూనే ఉంది. ఈ విషయాన్ని మరోసారి చర్చించాలి.

మరుసటి రోజు మహనీయ అలీ(ర) ఆ జనం వద్దకు వెళ్లి అడిగారు, "మీరయితే వెళ్ళి పోయారు కదా, తిరిగి ఎందుకు వచ్చారు?" అని. ఈజిప్టుకు చెందిన వారు దానికి సమా ధానంగా, "ఖలీఫా ఈజిప్టు గవర్నర్ కు వ్రాసిన లేఖను వేగుల వాడి నుంచి మేము లాక్కున్నాము, అందులో ఆయన, మేము అక్కడికి చేరిన వెంటనే మమ్మల్ని చంపి వేయాలని ఆదేశించారు." అన్నారు. ఆ తరువాత ఆయన కూఫా, బస్రా వారి నడిగితే, "మేము మా ఈజిప్టు సోదరుల సహాయానికి వారికి తోడుగా నిలిచామ"ని అన్నారు.

ఇదంతా విని ఆయన ఎంతో ఆగ్రహించారు. "ఈజిప్టుకు ఇరాక్‌కు తూర్పు పడమరల వ్యత్యాసం. అయినా కాస్త చెప్పండి, మీకు ఎలా తెలిసింది, ఈజిప్టు వారికి ఆ విషయ మున్న లేఖ చేజిక్కిందని? నిస్సందేహంగా మీరు చెప్పేదంతా అబద్ధం. ఇదంతా ఒక కుతంత్రం. ఇలా మీరందరూ చేసేది తిరుగుబాటు తప్ప మరేమీ కాదు" అని నిలదీశారు.

## అసలు విషయం

వాస్తవానికి తిరుగుబాటు దారుల అణచివేతకు ఎటువంటి చర్యలు తీసుకోవడం జరగలేదు, అందువల్ల వారికి బాగా బలం చేకూరింది. ఇప్పుడు వారు ఖరాఖండిగా చెప్పివేశారు, "మీరేమయినా అనుకోండి, మాకు ఈ ఖలీఫా అవసరంలేదు. అతన్ని సంహరించడం ధర్మ సమ్మతమే, మీరున్నూ మాకు తోడ్పాటు నివ్వండి"అని. దానికి మహనీయ అలీ, ఆగ్రహంతో "ఏమిటీ మీరనేది? ఈ తప్పుడు పనిలో నేను ఎంత మాత్రం సహకరించను, జాగ్రత్త!" అన్నారు. వారు, "అయితే మీరెందుకు వ్రాశారు మాకు?" అని అడిగారు. మహనీయ అలీ ఆశ్చర్యంగా, "నేనా? నేనెప్పుడూ ఎవరికీ ఏమీ వ్రాయ లేదు" అన్నారు. ఈ సమాధానం విని వారు ఒకరి ముఖాలు మరొకరు చూసుకోసాగారు.

దీన్ని బట్టి తెలుస్తోంది, ఈ కల్లోల జనకులు మహనీయ అలీ తరపున ఒక కాల్పనిక లేఖ ప్రకటన చేసి సాదా సీదా జనుల్ని తమ ఉచ్చులో బిగించారని. ఈ దిగ్బంధం జీకఅదా 26న జరిగింది. చాలామంది సహచర మాన్యులు హజ్జ్ కొరకు వెళ్లి ఉన్నారు. ఆ రోజుల్లోనే ఒకసారి మహనీయ ఉస్మాన్(ర) జుమా నమాజ్ చేయించడానికి వెళ్లగా ఆయన్ని పట్టి బాగా కొట్టారు, కడకు ఆయన స్పృహ తప్పి పడి పోయారు. ఆ తరువాత విద్రోహ మూక తమలో ఒకరిని నమాజ్ చేయించే ఇమామ్(నాయకుని)గా నియమించారు.

ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ ఖియార్ ఆ రోజుల్లోనే ఒక సారి మహనీయ ఉస్మాన్(ర)వద్దకు వెళ్లి, "మీరు యావన్ముస్లిముల ఇమామ్ (నాయకులు, ఖలీఫా), మీ పట్ల సంభవిస్తున్నదంతా మా కళ్ళ ముందరే జరుగుతోంది. మాకు ఆందోళన కారుల ఇమామ్ నమాజ్ చేయించడం పట్ల ఆంతర్యంలో ఏవగింపు కలుగుతోంది" అని విన్నవించుకున్నారు. దానికి ఆయన ఇలా బోధించారు, "జనులు చేసే కార్యాల్లో నమాజ్ ఉత్తమమయిన ఆచరణ. మంచి పనుల్లో మీరున్నూ చేరండి, వారు చెడులకు దిగినప్పుడు మీరు వారికి దూరమవండి."

ఎంత సహనం, సంయమనం ఆయనలో! అటువంటి సహన మూర్తి జీవితాన్ని జనం యాతనలకు గురి చేస్తున్నారు, ఎంత దౌర్భాగ్యం!! ఎన్నో సందర్భాల్లో ప్రవక్తశ్రీ(స) ఆయనకు స్వర్గ ప్రాప్తి శుభవార్త వినిపించి ఉన్నారు. ఆయన ప్రవక్త కూతుళ్ల ఇద్దరి భర్త. కొన్ని విషయాల్లో ఇస్లామ్ పట్ల ఆయన సేవలు అనన్యమయినవి. ఆయనను గురించి ప్రతీకారం కొరకు హుదైబియా ఒప్పందం సందర్భంగా బయ్త్ రిజ్వాన్ నిర్వహిం చడం జరిగింది. ఇదంతా ఆయన చరిత్ర అయినప్పటికీ ఆయన తన ఈ రక్త పిపాసుల ఎడల ఒక్క మాటనయినా నిందారోపణగా పలకలేదు. ✤

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

'చరితార్థులు'-2



# మౌల్వీ సయ్యద్ ఖుర్షీద్ హస్నైన్

## (1878-1941)

54






**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త**
**సయ్యిద్ నశీర్ అహమ్మద్**
**రూపొందించిన ఆల్బమ్**
**'చరితార్థులు' - 2 (తెలుగు)**
**THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి**
**గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**

**బ్రిటిష్ పాలకులకు** వ్యతిరేకంగా బీహార్ రాష్ట్రం గయా ప్రాంతం నుండి సాగిన జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొన్న మౌల్వీ సయ్యద్ ఖుర్షీద్ హస్నైన్ బీహార్ రాష్ట్రం గయా జిల్లా పాళి గ్రామంలో 1878లో జన్మించారు. ఆయన తండ్రి మౌల్వీ సయ్యద్ యహ్యా హస్నైన్ ప్రముఖ న్యాయవాది. ఆయన కుటుంబీకులంతా బ్రిటిష్ ప్రభుత్వంలో ఉన్నతాధికారులు, మంచి హోదాలను అనుభవిస్తున్న ప్రముఖులు. తండ్రి బాటలో న్యాయవాద వృత్తి చేపట్టడం లక్ష్యంగా విద్యాభ్యాసం గావించిన మౌల్వీ ఖుర్షీద్ 1908లో కలకత్తా నుండి న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేసి, ఖరగ్‌పూర్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ఆరంభించారు. ఆంగ్లేయుల దొరతనాన్ని ఏ మాత్రం సహించని ఆయనకు డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్, సయ్యద్ అలీ ఇమాం తదితర ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులతో ఏర్పడిన పరిచయాలు జాతీయోద్యమం దిశగా నడిపించాయి. ఆనాడు బెంగాలు పరగణాలో ఉన్న బీహార్‌ను విభజించాల్సిందిగా ఆరంభమైన ఉద్యమంలో మౌల్వీ ఖుర్షీద్ చురుగ్గా పాల్గొన్నారు. 1911లో కలకత్తా వెళ్ళి అక్కడి హైకోర్టులో పనిచేస్తూ వచ్చిన ఆయన, బీహార్ బెంగాల్ నుండి విడివడ్డాక, 1916లో బీహార్ రాష్ట్రం పాట్నా కేంద్రంగా ఇటు న్యాయవాద వృత్తిని, అటు జాతీయోద్యమకారుడిగా బాధ్యతలను నిర్వహించారు. మంచి వాగ్ధాటి, తర్కబద్ధంగా మాట్లాడగల నేర్పు కలిగిన ఆయన 1919 నాటి రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా పోరాడుతూ జాతీయోద్యమంలోకి ప్రత్యక్షంగా ప్రవేశించారు. స్వదేశీ ఉద్యమ లక్ష్యాలను తమ వ్యక్తిగత జీవితంలో కూడా పాటిస్తూ వచ్చిన ఆయన ఖిలాఫత్ - సహాయ నిరాకరణ ఉద్యమం సందర్భంగా ప్రభుత్వ విద్యా సంస్థలలో సాగుతున్న తన బిడ్డల చదు వును మాన్పించారు. మహాత్ముడి బాటలో ఖద్దరు ధరిస్తూ, ఖద్దరు ప్రచారానికి కృషిగావించారు. బ్రిటిష్ ప్రభుత్వ చర్య లకు వ్యతిరేకంగా ప్రజలను నడిపిస్తూ గయా జిల్లాలో భారత జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పలు సమావేశాలు, సభలు, హర్తాళ్ళను ఆంగ్ల ప్రభుత్వం కల్పిస్తున్న అడ్డంకులను అధిగమిస్తూ విజయవంతంగా నిర్వహించారు. 1921లో వేల్స్ రాకుమారుడి రాకను వ్యతిరేకిస్తూ ఉద్యమించిన ఆయన ఆరు మాసాల జైలు శిక్షకు గురయ్యారు. ఆ సందర్భంగా జైలులోని పరిస్థితులను మెరుగుపర్చాలని సత్యాగ్రహాన్ని పూని విజయం సాధించారు. 1925లో 'హజ్' చేయడానికి మక్కా వెళ్ళి వచ్చాక హిందూ-ముస్లింల మధ్య ఐక్యతను అభిలషిస్తూ, క్రియాశీలక రాజకీయాలకు దూరంగా మహాత్ముని బాటలో సామాజిక సమస్యల పరిష్కారం దిశగా సమాజ సేవా కార్య క్రమాలను చేపట్టారు. వ్యక్తిగత జీవితాన్ని నియమ-నిబద్ధతలతో ప్రజాసేవలో గడిపిన మౌల్వీ సయ్యద్ ఖుర్షీద్ హస్నైన్ 1941లో కన్నుమూశారు. ✤




**విశ్వప్రభువు,** సృష్టికర్త పరిపూర్ణుడు, సౌందర్యవంతుడు. ఆయన గుణగణాల్లో రవ్వంత లోపం కూడా లేదు. వైరుధ్యాల రూపంలో ప్రకటించబడిన లక్షణాలను తీసుకుంటే, ఆయనే ఆది, ఆయనే అంతం. ఆయన బాహ్యము, ఆయనే గోప్యము. నష్టం చేకూర్చేది ఆయనే, లాభం కలిగించేదీ ఆయనే. గౌరవమిచ్చేది ఆయనే, పరాభవం పాలు చేసేది ఆయనే. ఆయన క్షమించేవాడు, ప్రతీకారం తీర్చుకునేవాడూను. జీవితాన్నిచ్చేది ఆయనే, మరణాన్నిచ్చేదీ ఆయనే.

**ఆయనే ఆరంభం :** అల్లాహ్ ఆది నుంచి ఉన్నాడు. ఆయనకు ఆరంభం అంటూ లేదు. ఎల్లప్పుడు ఉన్నాడు. ఆయన కన్నా ముందు ఏదీ లేదు. ఈ విషయాన్ని ఇలా తెలియజేశాడు :

"ఆయనే ఆరంభము, ఆయనే అంతము. ఆయనే బాహ్యమూ, ఆయనే గూఢము. ఆయనకు ప్రతి వస్తువు గురించి బాగుగా తెలుసు." (అల్ హదీద్ : 3)

ఒక హదీసులో ఇలా చెప్పడం జరిగింది: "అల్లాహ్ ఉండేవాడు. ఆయన తప్ప మరేదీ ఉండేది కాదు. ఆయన అర్ష్ సింహాసనం నీటిపై ఉంది. ఆయన "జిక్ర్"లో ప్రతి విషయాన్ని రాశాడు. ఆకాశాన్ని, భూమిని సృష్టించాడు." (బుఖారి)

**ఆయనే అంతం :** అల్లాహ్ ఉనికికి పరిమితులు లేవు. ఆయనే అంతం. ఆయన తర్వాత మరేదీ లేదు. ఆయన కన్నా ముందు ఏదీ ఉండేది కాదు. ఆయనకు అంతం లేదు. ఆయన తర్వాత ఏదీ ఉండదు. ఆయన ఎల్లప్పుడు ఉన్నాడు. ఎల్లప్పుడు ఉంటాడు. అల్లాహ్ ఇలా తెలియజేశాడు :

"ఒక్క ఆయన ఉనికి తప్ప ప్రతిదీ నశించేదే" (అల్ ఖసస్ : 88)

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా అన్నారు: "ఓ అల్లాహ్, నువ్వే ఆరంభం, నీకన్నా ముందు ఏదీ లేదు. నువ్వే అంతానివి. నీ తర్వాత ఏదీ లేదు. నువ్వే బాహ్యము నీకు ఆవల ఏదీ లేదు. ఆయనలా ఎవరూ లేరు. అంటే ఆయన సృష్టించిన వాటిలో ఆయన వంటిది ఏదీ లేదు." (ముస్లిమ్)

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "ఆయన్ని పోలిన వస్తువు ఏదీ లేదు. ఆయన అన్నీ చూసేవాడు, వినేవాడూను." (అష్షూరా : 11)

అల్లాహ్ వంటిది ఏదీ సృష్టిలో లేదని ప్రతి ముస్లిమ్ ప్రగాఢంగా నమ్ముతాడు. ఆయన పవిత్రమైన ఉనికి శాశ్వతమైనది. ఆయనకు కునుకూ రాదు, ఆయన నిద్రపోడు. యావత్తు విశ్వం, భూమి, ఆకాశాలు, వాతావరణం, ఇందులో ఉన్న సమస్తం అల్లాహ్ యాజమాన్యంలో ఉన్నవే. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్‌ను అల్లాహ్ గురించి ప్రశ్నించినప్పుడు అల్లాహ్ స్వయంగా తన పరిచయాన్ని ఇలా తెలియజేశాడు :

"ఇలా చెప్పెయ్యి. ఆయన అల్లాహ్. అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు. ఎవరి ఆధారమూ, ఎవరి అక్కర లేనివాడు.

అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు.'' (ఇఖ్లాస్ : 1-4)

ఇందులో అల్ అహద్ అంటే అల్లాహ్ తన ఉనికి, గుణగణాలు, ఆచరణల విషయంలో ఒకే ఒక్కడు. ఏ విధంగాను ఆయనకు సాటి మరెవ్వరూ లేరు.

ఉనికి విషయంలో ఒకే ఒక్కడు అంటే అర్థం : ఆయన చాలా పదార్థాలతో ఏర్పడినవాడు కాదని అర్థం. అంటే ఆయనకు వేర్వేరు భాగాలు లేవు. ఆయన అధికారంలో భాగస్వాములు ఎవరూ లేరు. అల్లాహ్ స్వయంగా ఇలా సెలవిచ్చాడు:

''ఆయన పవిత్రుడు. ఆయనే అల్లాహ్. ఒకే ఒక్కడు. శక్తి సంపన్నుడు''. (అజ్జుమర్: 4)

**గుణగణాల విషయంలో ఒకే ఒక్కడు అంటే అర్థం** : అల్లాహ్ సృష్టిలో ఎవరికీ ఆయన వంటి గుణగణాలు లేవని అర్థం. ఆయన ఉనికి మాదిరిగానే ఆయన గుణగణాల విషయంలోను సాటిలేని వాడు. అయితే మనం అల్లాహ్ విషయంలో చెప్పే గుణగణాలు, మానవుల విషయంలో కూడా చెబుతుంటాం. ఈ లక్షణాలు అల్లాహ్‌లో ఉన్న స్థాయిలోనే మానవుల్లో ఉన్నాయని దానికి అర్థం కాదు. ఉదాహరణకు మనం ఎవరైనా వ్యక్తి ఎంతో దయామయుడని అనవచ్చు. ఈ మాటలకు అర్థం అల్లాహ్ మాదిరి సాటిలేని దయాగుణం మనిషికి ఉందని కాదు. అల్లాహ్ లోని అనంతమైన దయాగుణంలో అత్యంత స్వల్పభాగం మనిషిలో కూడా కనిపిస్తుందని అర్థం. ఇది కేవలం భాషాపరమైన పరిమితి వల్ల ఇలా మాట్లాడుతున్నాం. మనిషి చాలా పరిమితమైనవాడు. అల్లాహ్ గుణగణాలు పరిమితులు లేనివి.

అల్లాహ్ తన ఆచరణల రీత్యా కూడా ఒకే ఒక్కడంటే అర్థం: అల్లాహ్ తాను అనుకున్న పని చేయగలిగిన శక్తి కలిగి ఉన్నాడు. అనుకున్నది చేస్తాడు. అల్లాహ్ మాదిరిగా అనుకున్న పని చేయగల అధికారం ఎవరికీ లేదు. ఏ పని చేయాలన్నా అల్లాహ్‌కు ఎవరి అవసరమూ లేదు. అన్నింటినీ సృష్టించినవాడు ఆయనే. ఆయన ఇలా అన్నాడు:

''నీ ప్రభువు తాను కోరిన దానిని సృష్టిస్తాడు. (స్వయంగా ఆయనే తన పని కోసం తాను కోరిన వారిని) ఎన్నుకుంటాడు. ఈ ఎన్నిక చేయడం అనేది వారి పని కాదు. అల్లాహ్ పరిశుద్ధుడు. వారు చేసే షిర్క్‌కు అతీతుడు''. (అల్ ఖసస్: 68)

మరో చోట ఇలా సెలవిచ్చాడు:

''తాను తలిచినది చేసేవాడు''. (అల్ బురూజ్ : 16)

దివ్య ఖుర్‌ఆన్, హదీసుల్లో అల్లాహ్ సాక్ష్యాధారాలతో నిరూపించిన గుణగణాలున్నాయి. అవేమిటంటే:

**దైవత్వం** : అల్లాహ్ ఏదైనా సరే చేయగల శక్తిసామర్థ్యాలున్నవాడు. ఆయన ఏది చేయాలన్నా ఆయన్ను అడ్డుకునే శక్తి ఎవరికీ లేదు. ఈ విశాల విశ్వం దానికి అత్యుత్తమ ఉదాహరణ. దేనినైనా సృష్టించడం, అంతం చేయడం అనేది ఆయన అధికారంలో ఉన్న విషయం. సృష్టిలయలు ఆయనకే సాధ్యం. అన్నింటిపై అధికారం, ప్రాబల్యం ఆయనకే స్వంతం. భూమ్యాకాశాలపై ఆయనదే అధికారం. యావత్తు విశ్వం భవిష్యత్తు ఆయనపైనే ఆధారపడి ఉంది. ఆయన ఇలా సెలవిచ్చాడు :

''నిస్సందేహంగా మేము ఆకాశాలు, భూమి, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని కేవలం ఆరు రోజుల్లో సృష్టించాము. అలసట మమ్మల్ని తాకనైనా లేదు.'' (ఖాఫ్ : 38)

మరోచోట ఇలా సెలవిచ్చాడు : ''వారు చూడడం లేదా వారిని సృష్టించినవాడు వారికన్నా చాలా శక్తిమంతుడని'' (ఫుస్సిలత్ : 10)

**జ్ఞానం** : అల్లాహ్ అన్నీ తెలిసినవాడని ముస్లిమ్ విశ్వసిస్తాడు. గతం, వర్తమానం, భవిష్యత్తుల గురించి పూర్తి జ్ఞానం ఆయనకుంది. ఆయనకు సూక్ష్మమైన విషయాల జ్ఞానం ఎంత ఉందో అంతే జ్ఞానం స్థూలమైన విషయాల గురించి కూడా ఉంది. మరపు ఆయనకు ఎన్నడూ కలగదు. ఏమరుపాటుకు గురికావడం అనేది జరగదు. దివ్య ఖుర్‌ఆన్‌లో మూసా అలైహిస్సలామ్ ద్వారా అల్లాహ్ కింది మాటలు పలికించాడు:

''నా ప్రభువు పొరబాటులు చేయడు. ఏమరుపాటుకూ గురికాడు'' (తాహా : 52)

ఇంకా ఇలా తెలియజేశాడు: ''ఆయన ప్రతి వస్తువును పుట్టించాడు. ఆయనకు ప్రతి వస్తువును గురించీ తెలుసు''
(అల్ అన్‌ఆమ్ : 101)

ఇంకా ఆయన ఇలా అన్నాడు : ''అగోచరాల తాళం చెవులు అల్లాహ్ వద్దనే ఉన్నాయి. వాటిని ఈయన తప్ప ఎవరూ ఎరుగరు. భూమిలోనూ, సముద్రంలోను ఉన్నదంతా ఆయనకు తెలుసు. చెట్టునుండి ఏ ఆకైనా ఆయనకు తెలియకుండా రాలదు. భూమిలోని చీకటి పొరలలో ఉన్న ఏ గింజ అయినా ఆయనకు తెలియకుండా లేదు. తడిగా ఉన్నదీ, పొడిగా ఉన్నదీ అంతా ఒక విపులమైన గ్రంథంలో వ్రాయబడి ఉంది.''
(అల్ అన్‌ఆమ్ : 59)

అల్లాహ్ జ్ఞానం యాధృచ్ఛికమో, లేక తాత్కాలికమో కాదు. ఆయన జ్ఞానం ఆది నుంచి ఉన్నది. శాశ్వతమైనది. అల్లాహ్‌కు సంఘటనలు జరిగిన తర్వాత వాటి గురించి తెలుస్తుందని కొందరు అజ్ఞానంతో అంటుంటారు. ఇది కేవలం అజ్ఞానం మాత్రమే. అల్పమైన నోటితో ఇంత పెద్ద మాట చెప్పడం శోభించదు.

**అల్లాహ్ అనుకున్నది చేయగల అధికారం ఉన్నవాడు :** అల్లాహ్‌కు ఏ పనిలోను ఇతరుల సలహా సంప్రదింపుల అవసరమే లేదు. ఆయన అనుకున్నది స్వేచ్ఛగా చేయగలడు. ఆయన అనుకున్నదే జరుగుతుంది. ఆయన ఏదీ జరగకూడదని అనుకుంటాడో అది జరగదు. అందుకే ఆయన ఇలా సెలవిచ్చాడు:

“ఆయన ఏదన్నా చేయాలని అనుకున్నప్పుడు దానిని “అయిపో” అంటాడు. అంతే, అది అయిపోతుంది.” (గాఫిర్ : 68)

అల్లాహ్ అన్నీ వినేవాడు, అన్నీ చూసేవాడు: అల్లాహ్ గుణగణాల్లో మరొకటేమంటే ఆయన ఒకే సమయంలో అన్నీ చూడగలడు, అన్నీ వినగలడు. అత్యంత సూక్ష్మమైన ధ్వని కూడా ఆయన వినికిడి పరిధికి ఆవల లేదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

“తన భర్త వ్యవహారంలో నీతో వాదిస్తూన్న, అల్లాహ్‌తో మొరపెట్టుకుంటున్న స్త్రీ మాటలను అల్లాహ్ విన్నాడు. అల్లాహ్ మీ ఉభయుల సంభాషణను విన్నాడు. ఆయన అన్నీ వినేవాడు, అన్నీ చూసేవాడూను.” (అల్ ముజాదిలా : 1)

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ తన అనుచరులతో కలిసి వెళుతున్నారు. అనుచరులు గొంతెత్తి అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నారు. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారితో ఇలా అన్నారు:

“మిమ్మల్ని మీరు అలసటకు గురిచేయవద్దు. మీరెవరిని ప్రార్థిస్తున్నారో ఆయన చెవిటివాడు కాదు, ఇక్కడ లేనివాడు కాదు. ఆయన అన్నీ వినేవాడు, దగ్గరగా ఉన్నవాడు. మీతోపాటే ఉన్నవాడు.” (ముస్లిమ్)

అల్లాహ్ అందరినీ చూస్తున్నాడు. అన్నీ చూస్తున్నాడు. అత్యంత అల్పమైన వస్తువు కూడా ఆయన దృష్టిలో ఉంది. ఆయన చూడకుండా అడ్డుకునే వస్తువేదీ లేదు. దూరం, దగ్గర అనేవి ఆయనకు అర్థం లేనివి. ఒక్క చూపులో ఆయన మొత్తం విశ్వాన్ని చూస్తాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

“ఆయన్ను చూపులు అందుకోలేవు. ఆయన చూపులను అందుకుంటాడు. ఆయన సూక్ష్మద్రష్ట, సర్వ జ్ఞాని.” (అల్ అన్ఆమ్ : 103).

ఆయన ప్రవక్త మూసా, హారూన్ అలైహిమస్సలామ్‌లతో ఇలా అన్నాడు :

“నేను మీతో ఉన్నాను. చూస్తూ, వింటూ ఉన్నాను.” (తాహా: 46)

ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వద్దకు వచ్చినాడు, అతడికి ఆకలేస్తోంది. కాని అప్పుడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇంట్లో తినడానికి ఏదీ లేదు. ఆయన తన సహచరులను ఉద్దేశించి, ఈ వ్యక్తికి ఆతిథ్యం ఎవరిస్తారని అడిగారు. హజ్రత్ తల్హా (రజి అల్లాహుతాల అన్హు) తాను ఆతిథ్యమిస్తానని అన్నారు. హజ్రత్ తల్హా (రజిఅల్లాహుతాల అన్హు) ఇంటికి వెళ్ళారు. కాని, ఆయన ఇంట్లో కూడా పిల్లలకోసం ఉంచిన కొద్దిపాటి ఆహారం తప్ప మరేమీ లేదని తెలిసింది. హజ్రత్ తల్హా రజిఅల్లాహుతాలా అన్హు తన భార్యతో పిల్లలను నిద్రపుచ్చాలని, పిల్లల ఆహారాన్ని అతిథికి పెట్టాలని చెప్పారు. ఆమె అలాగే చేశారు. అతిథికి కడుపునిండా భోజనం పెట్టారు. ఆ రాత్రి హజ్రత్ తల్హా (రజిఅల్లాహుతాలా అన్హ్) తన భార్యా పిల్లలతో ఆకలికడుపుతోనే నిద్రపోయారు. మర్నాడు పొద్దుట ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లమ్) వద్దకు వచ్చినప్పుడు ప్రవక్త (స) ఆయనతో “ఓ తల్హా, రాత్రి మీరు చేసిన పనికి అల్లాహ్ చిరునవ్వు చిందించాడు. చాలా సంతోషించాడు” అన్నారు. ఈ సంఘటన తర్వాత అల్లాహ్ తరపునుంచి క్రింది వాక్యాలు అవతరించాయి:

“వారు స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ, తమకంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.” (అల్ హష్ర్:9)

అల్లాహ్ నవ్వుతాడని ముస్లిమ్ విశ్వసిస్తాడు. అల్లాహ్ నవ్వు ఆయన సృష్టించిన ప్రాణుల నవ్వు మాదిరిగా ఉండదని స్పష్టంగా

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పాపురాయి
గీటురాయి
వారపత్రిక

అర్థమయ్యే విషయం. మనకు దీనికి సంబంధించిన వివరాలు తెలియవు, కాని దీన్ని విశ్వసిస్తాం. అల్లాహ్‌కు సంబంధించిన అనేక లక్షణాల్లో ప్రాణుల్లోను కనిపించే లక్షణాల పోలికతో చెప్పడానికి కారణమేమంటే అల్లాహ్‌కు సంబంధించిన ఈ లక్షణాలను అర్థం చేసుకోడానికి మాత్రమే. ఇక వాటి వాస్తవం ఎలాంటిదన్నది మనకు తెలియదు. నిజానికి మనం మనకున్న బుద్ధివివేకాల పరిధిలో మాత్రమే ఏదన్నా అర్థం చేసుకోగలం. ఈ లక్షణాలను మనం అల్లాహ్ లక్షణాలుగా చెబుతున్నప్పుడు అవి అల్లాహ్ మాదిరిగా అత్యున్నతమైనవిగానే ఉంటాయి. ప్రాణుల మాదిరిగా కాదు.

**అల్లాహ్ మానధనుడు** : అల్లాహ్ నిషేధించిన పనులెవరైనా చేస్తే ఆయన ఆత్మాభిమానం దెబ్బతింటుంది. అందుకే అల్లాహ్ అశ్లీలమైన, సిగ్గుమాలిన పనులను నిషేధించాడు. హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి అల్లాహు అన్హు) ఒకసారి మాట్లాడుతూ, ఎవరైనా తన భార్యతో చెడుపని చేస్తున్నట్లు కనబడితే వారిని హతమారుస్తానని అన్నారు. ఈ విషయం ప్రవక్త ముహమ్మద్ (స)కు తెలిసినప్పుడు ఆయన (స) ఇలా అన్నారు, "మీరు సాద్ పౌరుషం పట్ల నిర్ఘాంతపోతున్నారా? నేను సాద్ కన్నా ఎక్కువగా పౌరుషం కలిగినవాడిని. నా కన్నా అల్లాహ్ ఎక్కువ పౌరుషం కలిగినవాడు. తన ఆత్మాభిమానం వల్లనే అల్లాహ్ అశ్లీలాన్ని, అశ్లీల ఆలోచనలను నిషేధించాడు" అన్నారు. (బుఖారి: 74161)

ప్రళయం నాడు అల్లాహ్ దర్శనమవుతుంది : ప్రళయదినాన విశ్వాసులకు అల్లాహ్ దర్శనం లభిస్తుందని ముస్లిములు విశ్వసిస్తారు. అల్లాహ్ ఇలా తెలియజేశాడు :

"ఆనాడు అనేక ముఖాలు తాజాగా, తేజోవంతంగా ఉంటాయి. తమ ప్రభువు వైపు చూస్తుంటాయి." (అల్ ఖియామహ్: 22-23)

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లమ్) ఇలా అన్నారు:

"ఆ చంద్రుడిని ఎంత స్పష్టంగా చూస్తున్నారో అంతే స్పష్టంగా మీ ప్రభువును మీరు చూస్తారు".

మరో హదీసులో ఇలా తెలియజేశారు : "మీరు మీ ప్రభువును తెరిచిన కళ్ళతో చూస్తారు".

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్, "మేము మూసా అలైహిస్సలామ్‌తో ప్రత్యక్షంగా మాట్లాడాము" అంటున్నాడు. (అన్నిసా : 164)

అయితే ఆ సంభాషణ ఎలా ఉంటుందన్నది మనకు తెలియదు. ఎందుకంటే అల్లాహ్ దాని గురించి మనకు చెప్పలేదు. ముస్లిములకు తెలిసినదేమంటే, అల్లాహ్ తాను కోరిన వారితో వివిధ రకాలుగా సంభాషిస్తాడు.

"అల్లాహ్ ముఖాముఖి మాట్లాడే అంత స్థానం మానవునిది కాదు. ఆయన మాట్లాడడం అనేది వహీ (సంకేతం) ద్వారానైనా జరుగుతుంది. లేదా తెర వెనుక నుండి అయినా జరుగుతుంది. లేదా ఈయన సందేశహరుణ్ణి (దైవదూత) ఎవరినైనా పంపుతాడు. అతను ఆయన ఆజ్ఞానుసారం ఆయన కోరినదానిని వహీ చేస్తాడు. ఆయన ఉన్నతుడు, వివేకవంతుడూను." (అష్షూరా : 51)

ప్రళయదినాన అల్లాహ్ విశ్వాసులతోను, సమస్త మానవులతోను ఎలాంటి మధ్యవర్తి లేకుండా మాట్లాడుతాడు. ఈ గుణగణాలన్నీ అల్లాహ్‌కు ఉన్నాయని ముస్లిములు విశ్వసిస్తారు. మనం అల్లాహ్‌ను ఈ గుణగణాలతో సహా స్మరించాలి. ఈ గుణగణాలను ఆయన మనకు నేర్పాడు. ఈ గుణగణాల స్వభావం ఎలాంటిది, వాటి వాస్తవికతేమిటి అన్న చర్చల్లోకి మనం వెళ్ళవలసిన అవసరం లేదు. ఎందుకంటే వాటిని మనం అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. అల్లాహ్ "అర్ష్ సింహాసనం" పై ఆసీనుడు కావడం, ఆయనకు కాళ్ళు, చేతులు, నోరు, తన ఆదేశాలను భూమిపై అవతరింపజేయడం తదితర గుణగణాలన్నింటినీ మనం విశ్వసిస్తున్నాం. అనవసరపు చర్చల్లోకి వెళ్ళం. అల్లాహ్ గుణనామాలను స్మరించడం అనేది ముస్లిము హృదయానికి ఆహారం వంటిది. అల్లాహ్ పట్ల ప్రేమకు వనరు వంటిది.

ఒకసారి కొందరు ముజాహిదుల బృందాన్ని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఒక ప్రాంతానికి పంపించారు. ఆ బృందం నాయకుడు ఎప్పుడు నమాజు చేయించినా చివరన సూరా ఇఖ్లాస్ చదివేవారు. వారు తిరిగి వచ్చిన తర్వాత ఈ విషయం గురించి మిగిలిన వారు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లమ్) వద్ద ప్రస్తావించారు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) వారితో, "ఆయననే అడగండి అలా ఎందుకు చేశారో" అన్నారు. ఆయన జవాబిస్తూ, సూరా ఇఖ్లాస్ దేవుని గుణనామాల ప్రస్తావన ఉన్న అధ్యాయమని, ఆ సూరాను తాను చాలా ప్రేమిస్తానని చెప్పారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లమ్) జవాబిస్తూ "వెళ్ళండి, ఆ వ్యక్తికి శుభవార్త తెలుపండి, అల్లాహ్ కూడా అతనిని చాలా ప్రేమిస్తున్నాడు" అన్నారు. (ముత్తఫఖున్ అలైహ్)



# పరిమితులు విధించిన ప్రజాతీర్పు-
# పరిణితి చెందిన రాహుల్

- యండి. ఉస్మాన్ ఖాన్

**కొన్నాళ్ళ** ముందు వరకు, నరేంద్రమోడీ ముందు రాహుల్ గాంధీ నిలబడలేడు అన్న వ్యాఖ్యలు తరచుగా వినిపించాయి. రాహుల్ పప్పు పప్పు అని ప్రత్యర్థులు తీవ్రంగా విమర్శించారు. కాని ప్రస్తుతం రాహుల్ గాంధీ బాగా పరిణితి చెందారు. పప్పుకాదు నిప్పు అని నిరూపించుకున్నారు. భారత్ జోడోయాత్రతో అంతులేని ప్రజాభిమానాన్ని కూడగట్టుకున్నారు. ప్రజలతో మమేకమవ్వడం, వారి సమస్యలు వినడం, ఎటువంటి భేషజాలు లేకుండా వారిలో ఒకడిగా కలిసిపోవడం ఆయన స్థాయిని మరింతగా ఇనుమడింప జేసింది. అనవసర విషయాల జోలికి పోకుండా, సమస్యలపైనే మాట్లాడడం, పరిష్కారాలు వెదకడం, దేశం, దేశ భవిష్యత్తు, యువకులు, మహిళల సమస్యలపై స్పందించడం, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవలసిన అవసరాన్ని విడమరచి చెప్పడం తదితర విషయాలు ప్రజలను ఆలోచింప జేశాయి. అదే సమయంలో ప్రధానమంత్రి పదవి వంటి ఉన్నత స్థాయిలో ఉన్న నరేంద్రమోడీ, ప్రధాని స్థాయిని దిగజార్చి నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు పలకడం, కేవలం అధికారం కోసం కులమతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం ప్రజలు గమనించారు. కేవలం ఎన్నికల్లో గెలవడం కోసం, అధికారాన్ని కాపాడుకోవడం కోసం మో, షాలు సహా, భాజపా నేతలంతా ఎంతటి నీచానికైనా దిగజారడం ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. అందుకే కోటి ఆశలు పెట్టుకొని ముహూర్తానికి ముందే ఆదరా బాదరాగా ఆరంభించిన అయోధ్య మందిరం కూడా మోడీని కాపాడలేకపోయింది. స్వయంగా అయోధ్యలోనే భాజపా అభ్యర్థి చిత్తుచిత్తుగా ఘోరంగా ఓడిపోవడమే దీనికి నిదర్శనం. అంతేకాదు రామమందిరం కొలువై ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సైతం భాజపా చతికిలపడి, చావుతప్పి కన్నులొట్టపోయింది. అబ్ కే బార్ చార్ సౌ పార్ అన్న మోడీ అహంకార పూరిత ప్రగల్భాలకు ప్రజలు సరిగానే స్పందించారు. గతంలో మూడొందలు పైచిలుకు స్థానాలు కట్టబెట్టి సొంతకాళ్ళపై నిలబడేలా ఆదుకున్న ప్రజలు ఈసారి బీహార్, ఆంధ్రా అనే రెండు ఊతకర్రల సాయంతో

మోడీని నిలబెట్టారు. ఈ నేపథ్యంలో 18వ లోక్‌సభ మొదటి సమావేశంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చేసిన ప్రసంగం పెద్ద దుమారమే రేపింది. 'భయపడొద్దు, భయపెట్టొద్దు' అని వివిధ మతాలను ఉటంకిస్తూ అభయ హస్తాన్ని చూపుతూ సాగిన రాహుల్ ప్రసంగం అధికారపక్ష సభ్యులకు చెమటలు పట్టించింది. రాహుల్ తన ప్రసంగంలో అగ్నివీర్, నీట్, మణిపూర్ సహా అనేక ముఖ్య అంశాలు ప్రస్తావించినా అవన్నీ పక్కకుపోయి, రాహుల్ కేవలం హిందూ సమాజాన్ని కించపరిచాడన్న అబద్ధపు అంశం ఒక్కటే పదేపదే ప్రచారంలోకొచ్చింది. నిజానికి రాహుల్ గాంధీ మొత్తం హిందూ సమాజాన్ని కించపరిచి మాట్లాడారా? లేక బీజేపీ, మోషాల హిందూత్వను మాత్రమే దునుమాడారా? అన్నది లోక్‌సభ సమావేశాలను వీక్షించిన ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. కాని ఈ పదేళ్ళ కాలంలో ఎన్నడూ లేనివిధంగా ప్రధాని మోడీ రాహుల్ ప్రసంగాన్ని మధ్యలోనే అడ్డుకుంటూ, రాహుల్ గాంధీ యావత్ హిందూ సమాజాన్ని అవమానించి మాట్లాడారంటూ నిండు సభలో రాహుల్ మాటల్ని వక్రీకరించే ప్రయత్నం చేశారు. కాని వెంటనే రాహుల్ గాంధీ అందుకొని, నై నై నై హిందూ సమాజం వేరు, మోడీ ప్రవచిత హిందూత్వ వేరు అంటూ ఘాటుగా, సూటిగా సమాధానమిచ్చారు. బీజేపీ హిందూ సమాజం కాదు, మోడీ హిందూ సమాజం కాదు, ఆరెస్సెస్ హిందూ సమాజం కాదు. మోడీ, బీజేపీ, ఆరెస్సెస్ హిందూ సమాజానికి, హిందూ ధర్మానికి గుత్తేదారులు కాదు. అని ఘాటుగా స్పందించారు. తమను తాము హిందువులని చెప్పుకొనే బీజేపీ, ఆరెస్సెస్, మోడీల హిందుత్వ అబద్ధాలు, విద్వేషం, అరాచకం పునాదులపై ఉందని, మిగతా హిందూ ధర్మమంతా సత్యం, సహనం, న్యాయం, ధర్మాలను బోధిస్తుందని వివరించారు. హిందూ ధర్మం హింసను, విద్వేషాన్ని ప్రేరేపించదని స్పష్టంచేశారు. మొత్తానికి రాహుల్ గాంధీ తన ప్రసంగం ద్వారా బీజేపీ, మోడీలు తాము మాత్రమే హిందూ సమాజ రక్షకులమని చాటుకుంటున్న అబద్ధపు ప్రచారానికి అడ్డుకట్ట వేయడంలో చాలామేరకు సఫలమయ్యారనే చెప్పవచ్చు.

అదే సమయంలో మోడీని ఎదుర్కొనే మొనగాడు లేడనే భాజపా నేతల భ్రమలనూ రాహుల్ తన మొదటి ప్రసంగంలోనే పటాపంచలు చేశారని కూడా భావించవచ్చు.

కనుక గతంలో లాగ ఇప్పుడు కూడా లోక్‌సభలో ఇష్టానుసారం ప్రవర్తించడం, నచ్చిన చట్టాలు చేస్తామని బెదిరించడం, నోటికొచ్చినంత మాట్లాడడం బహుశా ఇకముందు కుదరక పోవచ్చు. ఆ మేరకు భాజపా ఒళ్ళు దగ్గర పెట్టుకోవాల్సిందే.

## మస్జిద్ నుండి పార్లమెంటుకు
## - ఎంపీ అయిన మస్జిద్ ఇమామ్



ఢిల్లీ పార్లమెంటు స్ట్రీట్ జామె మస్జిదు... చాలామంది ముస్లిమ్ ఎంపీలు అక్కడే నమాజు చేస్తారు. ఎంతోమంది ఎంపీలకు నమాజు చేయించిన ఆ మసీదు ఇమామ్ గారు ఇప్పుడు ఎంపీ అయ్యారు. యూపీలోని రామ్ పూర్ నుంచి ఎంపీగా గెలుపొంది చట్టసభల్లో అడుగుపెట్టనున్న ఆ మౌలానా ఎంపీ ముహిబ్బుల్లాహ్ నద్వీ. బీజేపీ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్‌పై భారీ మెజారిటీతో విజయం సాధించారు. దారుల్ ఉలూమ్ నద్వతుల్ ఉలమా ఇస్లామిక్ యూనివర్శిటీ నుంచి ఆయన పట్టభద్రుడు. ఈ మదర్సాలో చదువుకున్న వారు తమ పేరు చివరన నద్వీ అని పెట్టుకుంటారు. గతంలో అస్సాం నుంచి బద్రుద్దీన్ అజ్మల్ ఖాస్మి లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. ఆయన ఈ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఎం.ఎ.,బీఎడ్ చదివిన ముహిబ్బుల్లాహ్ నద్వీ మొదటిసారి పార్లమెంటులో అడుగుపెట్టిన నద్వతుల్ ఉలమా గ్రాడ్యుయేట్‌గా ప్రత్యేకతను చాటుకున్నారు. ఇప్పటివరకూ దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్ ఉలమాలే పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఇక ఇప్పుడు నద్వతుల్ ఉలమా ఉలమాలూ పార్లమెంటుకు ఎన్నికవడం శుభపరిణామం. పార్లమెంటులో మైనారిటీల సమస్యలు, వారిపై జరుగుతున్న అణచివేతలపై గళం విప్పుతానని నద్వీ అంటున్నారు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**89 ఆయత్‌లు**

# 43. అజ్ జుఖ్రుఫ్

33 – 35 సర్వజనులూ ఒకే విధానానికి చెందినవారయిపోతారన్న సంశయం లేకపోతే మేము కారుణ్య ప్రభువును నిరాకరించేవారి ఇండ్లకప్పులు, వారు తమ మేడల పైకిఎక్కే మెట్లు, వారి తలుపులు, వారు దిండ్లు వేసుకుని కూర్చునే తఖతులు, అన్నీ వెండి బంగారాలతో చేసిపెట్టేవారము.[33] ఇదయితే కేవలం ప్రపంచ జీవితపు సామగ్రి, మరి పరలోకమయితే నీ ప్రభువు వద్ద కేవలం నిష్ఠాగరిష్ఠులయినవారి కొరకే పరిమితం.

36 – 39 ఏ వ్యక్తి కారుణ్య ప్రభువు సంస్మరణ[34] పట్ల ఏమరుపాటుగా వ్యవహరిస్తాడో మేము అతనిపైన ఒక షైతాన్‌ని ఆవహింపజేస్తాము. వాడు అతని సహచర మిత్రుడయిపోతాడు. ఈ షైతానులు ఇటువంటి వారిని రుజుమార్గాన రాకుండా ఆపుతారు, వారేమో తాము సరయిన మార్గానే పోతున్నట్లు తమంతట భావించుకుంటూ ఉంటారు. కడకు ఈ వ్యక్తి మా వద్దకు చేరినప్పుడు తన షైతాన్‌ని సంబోధించి అంటాడు, "నాకూ నీకూ మధ్యన తూర్పు పడమరలంత దూరం ఉంటే ఎంత బావుండేది, నీవయితే అత్యంత దుష్టుడయిన మిత్రుడివిగా తేలావు." ఆ సమయాన వారికి చెప్పడం జరుగుతుంది, మీరు ఎలాగూ అన్యాయంగా వ్యవహరించారు, ఇప్పుడు ఈ విధంగా పలకడం మీకు ఏ విధంగానూ ప్రయోజనకరం కాదు, మీరూ మీ షైతానులూ శిక్షా యాతనలో భాగస్వాములయ్యారు.[35]

40–42 ప్రవక్తా, నీవిప్పుడు చెవిటివారికి వినిపిస్తావా? లేదా గుడ్డివారికీ, స్పష్టంగా అపమార్గాన పడి ఉన్న వారికీ సన్మార్గం చూపుతావా?[36] ఇకనయితే మేము వీరికి శిక్ష విధించవలసే ఉంది, నిన్ను ప్రపంచం నుంచి నిష్క్రమింపజేసినా, లేదా వీరికి మేము వాగ్దానం చేసిన అంతిమ పరిణామాన్ని నీకు కళ్ళారా చూపించినా, మాకు వీరిపైన పూర్తి అధీనం ఉంది.

33. అంటే, ఈ వెండి బంగారాలు ఎవరికయినా దొరకడం మీ దృష్టిలో వరప్రసాదాల పరమోన్నత సోపానం, వారి విలువకు ఘనతకు పరాకాష్ఠ. కాని ఇది అల్లాహ్ దృష్టిలో అత్యంత హీనమయిన విషయం. మానవులంతా తిరస్కారం వైపునకు జారిపోతారన్న ప్రమాదం లేకపోతే ఆయన తిరస్కారులందరి లోగిళ్ళు వెండి బంగారాలతో కట్టించేవాడు. ఈ అత్యల్పమయిన దినుసులు మానవ శ్రేష్ఠతకు, హృదయ పరిశుద్ధతకు, ఆత్మ పవిత్రతలకు ఆధారాలుగా పరిగణించబడతాయా? ఈ సంపదలయితే సమాజంలోని అత్యంత హేయమయిన మనుషుల వద్దకూ పోయి చేరుతాయి. వాళ్ళ జుగుప్సాకరమయిన చరిత్రవల్ల సమాజం మొత్తం కంపు కొడుతూ ఉంటుంది. ఇటువంటి వాటిని మీరు మానవుని గొప్పదనానికి ప్రమాణంగా చేసిపెట్టుకున్నారు.

34. మూలంలో జిక్ర్ అనే పదప్రయోగం జరిగింది. ఇది సువిస్తృత భావం గల పదం. 'కారుణ్య ప్రభువు సంస్మరణ' అంటే ఉద్దేశం, ఆయన్ని జ్ఞాపకం చేసుకోవడమనీ, అలాగే ఆయన వద్ద నుండి వచ్చిన ఉపదేశం అనీ, ఈ ఖుర్ఆన్ అని కూడా భావం.

35. అంటే, మిమ్మల్ని అపమార్గం పట్టించిన వానికి శిక్ష లభిస్తుందన్న విషయంలో మీకు సాంత్వన, ఓదార్పు కలిగే అవకాశం, కోణం ఏదీలేదు. ఎందుకంటే అపమార్గాన్ని స్వీకరించినందుకు శాస్తిగా మీరున్నూ అదే శిక్ష అనుభవిస్తున్నారు.

36. భావం, వినడానికి సిద్ధంగా ఉన్నవారి, వాస్తవాల పట్ల కళ్ళు మూసుకోనివారి పట్ల శ్రద్ధ చూపు గుడ్డివారికి చూపేందుకు, చెవిటివారికి వినిపించేందుకు ప్రయత్నిస్తూ నీ ప్రాణాలను ధారబోయకు నీ సోదరులు సన్మార్గాన్ని ఎందుకు అనుసరించడం లేదని, ఎందుకు తమ్ముతాము దైవ శిక్షకు పాత్రులుగా రూపొందించుకుంటున్నారని బెంగపడుతూ క్రుశించిపోనవసరమూ లేదు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

(534వ హదీసు - గత సంచిక తరువాయి)

ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: మేము శీఘ్రంగా వారి కోసం ప్రయాణ ఏర్పాట్లు చేయసాగాము. ఒక సంచిలో చద్దిమూట పెట్టాము. అస్మా బిన్తె అబీ బక్ర్ (ర.అ) తన వోణీని చింపి ఒక గుడ్డ ముక్కతో ఆ సంచి కట్టేసింది. ఈ కారణంగానే ఆమెకు 'జాతన్నితాఖ్' (దుపట్టా కల స్త్రీ) అనే పేరు పడింది. తరువాత దైవ ప్రవక్త(స), అబూబక్ర్(రజి)లిరువురూ సౌర్ పర్వత గుహలో తలదాచుకున్నారు. మూడు రాత్రులు అక్కడే గడిపారు [1]. అబ్దుల్లాహ్ బిన్ అబూబక్ర్(రజి) రాత్రిపూట అక్కడికి వెళ్ళి వారితో గడిపేవారు. ఆ యువకుడు బుద్ధిమంతుడు, విషయావగాహన కలవాడు. జాము రాత్రిన గుహ నుండి బయలుదేరి తెల్లవారక ముందే మక్కా నగరానికి చేరుకునేవాడు. పగలంతా మక్కాలో జరిగేదంతా గమనించి, రాత్రి చీకటి కమ్ముకున్న మీదట గుహకు వెళ్ళి పూసగుచ్చినట్లుగా వారికి అంతా వివరించి చెప్పేవాడు. అబూబక్ర్(రజి) బానిస అయిన ఆమిర్ బిన్ ఫుహైరా (రజి) ఆ ప్రాంతంలోనే మేకలను మేపుతూ, రాత్రి పొద్దుపోయాక వారిద్దరి కోసం పాలిచ్చే మేకల్ని తోలుకుని వచ్చేవారు. మూడు రాత్రుల వరకూ ఆమిర్ మామూలు అదే. అబూబక్ర్(రజి) బనీ దైల్ తెగకు చెందిన ఒక వ్యక్తి (అబ్దుల్లాహ్ బిన్ అరీఖత్)ని, దారి చూపించడానికి వేతనంపై పెట్టుకున్నారు. ఆ వ్యక్తి దారి చూపించడంలో ప్రవీణుడు. ఆలె ఆస్ బిన్ వాయల్‌తో మైత్రి కలవాడు. ఖురైషు అవిశ్వాసుల మతావలంబీకుడు. ఆ మహనీయులిద్దరూ ఆ వ్యక్తిపై గల నమ్మకంతో తమ రెండు ఒంటెల్ని అతనికి స్వాధీన పరిచారు. మూడు రాత్రులు గడిచిన మీదట ఆ వ్యక్తి వారిని సౌర్ గుహలో కలుసుకోవాలని ఖరారు చేసుకోవటం జరిగింది. దాని ప్రకారమే అతను మూడవ రాత్రి గడిచిన మీదట- ప్రభాత సమయంలో- ఆ రెండు ఒంటెలను తోలుకుని వచ్చేశాడు. ఆమిర్ బిన్ ఫుహైరా (రజి), ఆ దారి చూపే వ్యక్తికి తోడయ్యారు. వారు ఆ మహనీయులిద్దరినీ వెంటబెట్టుకుని సముద్ర తీర ప్రాంతం మీదుగా ప్రయాణం చేయసాగారు.

సురాఖా బిన్ మాలిక్ కథనం: మా వద్దకు ఖురైష్ అవిశ్వాసుల దూత ఒకతను వచ్చి దైవప్రవక్త(స)ను, అబూబక్ర్(రజి)ను హతమార్చిన లేదా ఖైదీలుగా పట్టి తీసుకువచ్చిన వారికి వందేసి ఒంటెల చొప్పున బహుమానం ఇవ్వబడతాయని చెప్పాడు. నేను మా తెగ వారైన బనీ ముద్లిజ్ సమావేశంలో కూర్చుని ఉన్నాను. వారి మనిషి ఒకతను వచ్చి మా సమీపంలో నిలబడ్డాడు. మేము అప్పటికి అక్కడే కూర్చుని ఉన్నాము. ఆ వ్యక్తి ఇలా అన్నాడు: 'సురాఖా! తీరప్రాంతంలో నేనిప్పుడే కొన్ని నీడల్ని చూసి వచ్చాను. బహుశా వారు ముహమ్మద్(స), అతని సహచరులు అయి ఉంటారని నా అనుమానం'. సురాఖా ఇలా అన్నాడు: అతని అంచనా సరైనదేనని నాకు అనిపించింది. కాని నేను అతనితో, 'వాళ్ళు కారులే. నేను ఇందాక ఫలానా ఫలానా మనుషుల్ని చూశాను. వాళ్ళు మా ముందు నుంచే అటువైపు వెళ్ళారు' అని చెప్పాను. ఆ తరువాత నేను ఆ సమావేశంలో కాసేపు కూర్చుని ఆ తరువాత లేవగానే సరాసరి ఇంటికి వెళ్ళాను. 'నా గుర్రాన్ని తీసుకుని గుట్ట వెనుక వచ్చేయ్. నేను వచ్చేవరకూ అక్కడే వేచి ఉండు' అని నా బానిస స్త్రీకి పురమాయించాను. ఆ తరువాత నేను ఈటె తీసుకుని మా ఇంటి పెరటి మార్గం గుండా బయటికి నడిచాను. ఈటె మొనతో నేలపై గీత వేస్తూ వెళ్ళాను (ఎవరికీ నాపై అనుమానం రాకూడదన్న ఉద్దేశ్యంతో ఇలా నటించాను). ఆ విధంగా నేను గుట్ట వెనుకాల వచ్చి గుర్రంపై స్వారీ అయ్యాను. మెరుపు వేగంతో పోతూ వారిని సమీపించాను.

సరిగా అదే సమయంలో గుర్రం ఎదురుదెబ్బ తిని నన్ను పడగొట్టేసింది. నేను వెంటనే లేచి నిలబడి, నా అంబుల పొదిలో నుంచి బాణం తీసి దాని ద్వారా జోస్యం (శకునం) చూశాను. కాని ఆ జోస్యం నాకు అనుకూలంగా లేదు. బాణం ద్వారా తీసిన జోస్యాన్ని లెక్కచేయకుండా మరోసారి గుర్రమెక్కి దౌడు తీయించాను. గుర్రం చాలా వేగంగా పరుగెత్తుతోంది. వారిని సమీపించింది. నేను దైవప్రవక్త(స) చేసే పారాయణాన్ని కూడా విన్నాను. దైవప్రవక్త(స) నావైపు చూడలేదు గాని అబూబక్ర్(రజి) మాత్రం పదేపదే వెనక్కి తిరిగి చూస్తున్నారు. అప్పుడు నా గుర్రం ముందరికాళ్ళు రెండూ నేలలో దిగబడిపోయాయి. అది మడమల వరకూ నేలలో కూరుకుపోగానే నేను దాని వీపుపై పడిపోయి, గద్దించాను. దానిని ఉరికించే ప్రయత్నం చేశాను. కాని అది తన కాళ్ళను నేలలోనుంచి తీయలేకపోయింది. అతి కష్టమ్మీద అది తన కాళ్ళపై నిలబడే యత్నం చేస్తుండగా, దాని ముందరి కాళ్ళ నుంచి దుమ్ము రేగి మిన్నంటసాగింది. నేను బాణాల ద్వారా శకునం చూశాను. ఈసారి కూడా నేను ఇష్టపడని శకునమే వచ్చింది. అప్పుడు నేను రక్షణ కోసం ముహమ్మద్(స)ని పిలిచాను. నా కంఠం విని వారంతా ఆగిపోయారు. నేను నా గుర్రంపై స్వారీ అయి వారిని సమీపించాను. దురుద్దేశ్యంతో వారి వరకూ చేరకుండా నిలువరించబడిన నాకు ఒక విషయం బాగా అర్థమయింది. అదేమిటంటే, దైవప్రవక్త(స) సందేశం తప్పక ప్రాబల్యం వహిస్తుంది. అందుకే ఆయన(స)తో 'మీ జాతి వారు మిమ్మల్ని చంపడానికి నూరు ఒంటెల బహుమానాన్ని ప్రకటించారు' అని చెప్పాను. ఆ తరువాత ఖురైషుల పథకాన్ని గురించి విడమరిచి చెప్పాను. వారి సేవలో భోజన సామగ్రిని, ఇతర వస్తువులను కూడా సమర్పించాను. కాని దైవప్రవక్త(స) స్వీకరించలేదు. నా నుండి మరే ఇతర వస్తువును కూడా కోరలేదు గానీ, తమ ఆచూకీని గురించి ఎవరికీ చెప్పరాదని మాత్రం సూచించారు. మరి నాకు అభయ పత్రం వ్రాసి ఇవ్వమని ఆయన్ని అభ్యర్థించాను. ఆ మేరకు దైవ ప్రవక్త(స) ఆమిర్ బిన్ ఫుహైరాకు ఆదేశించారు. అతను ఒక తోలు పత్రంపై అభయం వ్రాసి ఇచ్చాడు.[2] ఆ తరువాత దైవప్రవక్త(స) ముందుకు సాగిపోయారు.

ఉర్వా బిన్ జుబైర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స)కు జుబైర్(రజి) ఎదురుపడ్డారు. ఆయన ఒక వర్తక బిడారుతోపాటు సిరియా నుండి తిరిగి వస్తున్నారు. ఆయన దైవప్రవక్త(స)కు, అబూబక్ర్‌కు తెల్లని వస్త్రాలు సమర్పించారు.[3] అటు మదీనాలో కూడా, దైవప్రవక్త మక్కా నుండి హిజ్రత్ చేసి వస్తున్నారన్న సమాచారం ముస్లింలకు అందింది. వారు ప్రతి రోజూ ఉదయం 'హర్రా' ప్రదేశానికి వచ్చి, మధ్యాహ్నం వరకు నిరీక్షించేవారు. మధ్యాహ్నం ఎండ తాపం కారణంగా వారు తమ ఇండ్లకు తిరిగి వెళ్ళిపోయేవారు.

ఒకరోజు వారు సుదీర్ఘ నిరీక్షణ తరువాత తమ తమ ఇండ్లకు తిరిగి వచ్చేశారు. ఆ సమయంలోనే ఒక యూదుడు ఏదో చూడటానికి తన మేడపైకెక్కాడు. అతను దైవప్రవక్తను, ఆయన సహచరులను చూశాడు. వారు వేగంగా (మదీనా వైపే) వస్తున్నారు. అతను మొదట్లో ఎండమావి అని భ్రమపడ్డాడు. కాని వారు సమీపిస్తున్న కొద్దీ ఎండలో ఇసుక మెరవటం తగ్గసాగింది. 'ఓ అరబ్బు జనులారా! అడుగో, ఇన్నాళ్ళుగా మీరు ఎదురుచూస్తున్న మీ మహనీయుడు వచ్చేశార'ంటూ బిగ్గరగా కేక వేశాడు. ముస్లింలు సాయుధులై అటువైపు పరుగెత్తారు. 'హర్రా'లో స్వాగతం పలికారు. ఆయన (స) వారికి కుడివైపున ముందుకు సాగుతూ బనీ అమ్ర్ బిన్ ఔఫ్ వాడలో విడిది చేశారు. అది రబీవుల్ అవ్వల్ నెల సోమవారం. జనులను కలుసుకోవడానికి అబూబక్ర్ లేచి నిలబడ్డారు. దైవప్రవక్త(స) మాత్రం నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు. అంతకుముందు ఎన్నడూ దైవప్రవక్త(స)ను ప్రత్యక్షంగా చూడని అన్సార్ ప్రజలు అబూబక్ర్(రజి)కే సలామ్ చెబుతున్నారు. కాని దైవప్రవక్త(స)పై ఎండ పడగానే అబూబక్ర్ వచ్చి తన దుప్పటిని నీడగా పట్టుకోవడంతో అందరికీ అర్థమయింది, దైవప్రవక్త ఎవరో. దైవప్రవక్త(స) దాదాపు పదిరాత్రుల వరకూ బనీ అమ్ర్ బిన్ ఔఫ్ వాడలో ఆగి ఉన్నారు. ఆ సందర్భంగానే భయభక్తుల పునాదిపై నిలిచివున్న మస్జిద్(ఖుబా)ను నిర్మించారు.[4] ఆ మస్జిద్‌లో ఆయన నమాజ్ చేశారు. ఆ తరువాత (శుక్రవారం

**నాడు) దైవప్రవక్త తన ఒంటెపై స్వారీ అయ్యారు. సహచర మాన్యులు కూడా కాలినడకన ఆయన్ని అనుసరించారు. చివరకు ఆయన ఒంటె మదీనా మునవ్వరాలో– ప్రస్తుతం మస్జిదె నబవీ ఉన్నచోట–వచ్చి కూర్చుంది. ఆ స్థలంలో కొంతమంది ముస్లింలు– ఆ రోజుల్లో– నమాజ్ ఆచరించేవారు. ఆ స్థలం సుహైల్, సహ్లా అనే ఇద్దరు అనాథ బాలురకు చెందినది. అక్కడ ఖర్జూరాలను ఎండబెట్టేవారు. ఆ అనాథలిద్దరూ అస్అద్ బిన్ జురారా సంరక్షణలో ఉండేవారు. ఆయన ఒంటె ఆ స్థలంలో కూర్చోవటం వల్ల "ఇన్షాఅల్లాహ్ ఇదే మేము ఆగే స్థలం కాగలద"ని ప్రకటించారు. ఆ తరువాత ఆయన(స) ఆ అనాథ బాలురిద్దరినీ పిలిచి, మస్జిద్ నిర్మాణం కొరకు ఆ స్థలాన్ని వారి నుండి కొనుగోలు చేయాలన్న తన ఉద్దేశ్యాన్ని తెలిపారు. కాని ఆ అబ్బాయిలిద్దరూ, 'దైవప్రవక్తా! మేము ఈ స్థలాన్ని మీకు ఉచితంగా ఇస్తామ'ని విన్నవించుకున్నారు. కాని ఉచితంగా స్వీకరించడానికి ఆయన(స) నిరాకరించారు. ఆ స్థలానికి తగిన మూల్యం చెల్లించి మస్జిద్ నిర్మాణానికి పూనుకున్నారు. మస్జిద్ నిర్మాణం జరుగుతున్నప్పుడు దైవప్రవక్త(స) కూడా తన ప్రియ సహచరులతో కలసి ఇటుకలు మోసారు. ఇటుకలు మోస్తున్నప్పుడు ఆయన(స) ఇలా పలికేవారు: "ఈ బరువు ఖైబర్ బరువు వంటిది కాదు.[5] పైగా దీని ప్రతిఫలం అల్లాహ్ వద్ద మిగిలి ఉంటుంది. ఇందులో ఎంతో పరిశుభ్రత, పరిశుద్ధత ఉంది." దైవప్రవక్త(స) ఆ సందర్భంగా ఇలా వేడుకుంటూ ఉండేవారు: "దేవా! ప్రతిఫలమైతే పరలోకంలో లభించేదే. నీవు అన్సార్లపై, ముహాజిర్లపై నీ కారుణ్యాన్ని అవతరింపజెయ్యి."**

534-1. హిజ్రత్ సంఘటన- సందర్భానుసారం- సంక్షిప్తం గానూ, కూలంకషంగానూ హదీసులలో ప్రస్తావనకు వచ్చింది. ఇస్లామ్ చరిత్రలో హిజ్రత్కు గల ప్రాముఖ్యం ఎనలేనిది. ఈ ప్రయాణంలో దైవప్రవక్త(స) సాంగత్యం పొందే భాగ్యం మహనీయ అబూబక్ర్(రజి)కు దక్కింది. మక్కా నగరానికి ఐదు మైళ్ళ దూరాన ఉన్న 'సౌర్' పర్వత గుహలో మూడు రోజులపాటు ఆయన దైవప్రవక్త(స)కు చేసిన సేవలు కూడా చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగినవి.

534-2. 'అల్ ఇస్తీయాబ్'లో పొందుపరచబడిన దాని ప్రకారం సురాఖా బిన్ మాలిక్ నిరాశతో వెనుతిరిగి వస్తున్నప్పుడు దైవ ప్రవక్త(స) అతనితో, ''సురాఖా! కిస్రా (ఈరాన్ చక్రవర్తి) స్వర్ణ కంకణాలు నీ చేతుల్లో తొడిగించబడినప్పుడు నీ వైభవం ఎలా ఉంటుందో కాస్త ఊహించుకో'' అన్నారు.

ఉహుద్ యుద్ధం తర్వాత సురాఖా ఇస్లాం స్వీకరించారు. ఉమర్ ఫారూఖ్(రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో 'మదాయన్' జయించ బడినప్పుడు కిస్రా కిరీటంతో పాటు విలువైన ఆభరణాలు వజ్ర వైఢూర్యాలు ఖలీఫా దర్బారుకు తరలించబడ్డాయి. హజ్రత్ ఉమర్(రజి) సురాఖాను పిలిపించి, ఆయన చేతులకు కిస్రా కంకణాలు తొడిగించారు. 'అల్లాహు అక్బర్! ఒక అరబ్బు పల్లెటూరి వ్యక్తి చేతుల్లో కిస్రా కంకణాలు తొడిగించిన అల్లాహ్ మహోన్నతుడు' అని ఉమర్ పలికారు.

ఈ ప్రయాణ సందర్భంగా దైవప్రవక్త(స) ఉమ్మె మాబద్ గుడారంలో విశ్రాంతి తీసుకున్నారు. అక్కడి నుండి బయలుదేరినప్పుడు దారిలో-ఆయన అన్వేషణలో వస్తున్న బురైదా అస్లమీ తారసపడ్డాడు. అయితే ఆయన(స)తో సంభాషణ జరిగిన మీదట, తన డెభ్భయి మంది సహవాసుల సమేతంగా ధర్మపరివర్తన చెందాడు.

534-3. ఆ మార్గంలోనే సిరియా నుండి వర్తక బిడారుతో పాటు వస్తున్న జుబైర్ బిన్ అవ్వామ్(రజి) ఎదురుపడ్డారు. ఆయన దైవప్రవక్త(స)కు, అబూబక్ర్(రజి)కు ధవళ వస్త్రాలు సమర్పించుకున్నారు.

534-4. దైవదౌత్యం లభించిన 13వ యేట రబీవుల్ అవ్వల్ నెల సోమవారం నాడు దైవ ప్రవక్త(స) అమ్ర్ బిన్ ఔఫ్ వాడకు చేరుకున్నారు. అక్కడే ఆయన పదిరోజుల పాటు (గురువారం వరకు) ఆగి ఉన్నారు. ఆ సందర్భంగానే 'మస్జిదె ఖుబా'కు పునాది వేశారు. 12 రబీవుల్ అవ్వల్ నెల హిజ్రీ మొదటి సంవత్సరం (క్రీ.శ 622 సెప్టెంబర్ 22న) శుక్రవారం నాడు అక్కడి నుండి బయలుదేరారు. బనూ సాలిమ్ తెగవారు నివసించే వీధిలోకి వచ్చేటప్పటికి జుమా నమాజ్ వేళ అయింది. అక్కడ ఆయన 100 మందితో కలసి జుమా నమాజ్ చేశారు. ఆయన (స) సారథ్యంలో- ఇస్లామ్లో-చేయబడిన మొట్టమొదటి జుమా నమాజ్ అదే. ఆ తరువాత 'యస్రిబ్' నగరంలోనికి దక్షిణ దిక్కు నుండి ప్రవేశించారు. ఆనాటి నుంచే ఆ నగరం 'మదీనతున్నబీ'గా పిలువబడసాగింది.

534-5. ఆ కాలంలో ప్రజలు ఖైబర్ ప్రాంతం నుండి ఖర్జూరాలు, ద్రాక్ష పండ్లు మోసుకుని వచ్చి ఇచ్చేవారు. ఈ బరువు ప్రపంచంలోనే తరిగిపోతుంది. కాని మస్జిద్ నిర్మాణం కొరకు ఎత్తుకునే బరువు దైవసన్నిధిలో ఎన్నటికీ తరగదు అన్నది ప్రవక్త(స) పలుకుల సారాంశం.




అర్షియా, విజయవాడ

**'ఒకరిని క్షమించడం వల్ల హృదయంలో ప్రశాంతత కలుగుతుంది. ప్రతీకారంతో రగిలిపోతే మాత్రం యాంగ్జయిటీ, డిప్రెషన్ పెరిగి మనశ్శాంతి లేకుండా పోతుంది.'** అని మెడికల్ సైన్సు చెబుతున్న మాట. మరి ఖుర్ఆన్ ఏమంటుందంటే.. 'ఒకవేళ మీరు ఉపేక్షించి, మన్నిస్తే అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను.' (ఖుర్ఆన్ 64:14) క్షమాగుణం అనేది అల్లాహ్ గుణాలలో ఒకటి. ఇదే గుణాన్ని తన దాసులలోనూ చూడాలనుకుంటాడు అల్లాహ్. అందుకే ఖుర్ఆన్ గ్రంథంలో క్షమాగుణాన్ని పెంపొందించే ఎన్నో ఖుర్ఆన్ వాక్యాలున్నాయి. ఒకరిని క్షమించడం, మనవల్ల జరిగే తప్పిదాలకు ఒకరిని క్షమించమని అడగడం ఈ రెండు సుగుణాలనూ ముస్లిములు అలవర్చుకోవాలని ఖుర్ఆన్ పేర్కొంటోంది. క్షమించే వారు అల్లాహ్ మెప్పు పొందుతారు. సహనం, క్షమాగుణం ఇవి విశ్వాసుల లక్షణాలు, వీటిని అలవర్చుకోవాలని ఖుర్ఆన్ ఉపదేశిస్తుంది. ప్రజల మధ్య సయోధ్యకోసం, మన్నింపుల వైఖరిని అలవర్చేందుకు ముస్లిములు కృషిచేయాలి. మనం మన నిత్య జీవితంలో ఎన్నో తప్పిదాలకు పాల్పడుతున్నాము. అల్లాహ్‌కు గల 99పేర్లలో క్షమాగుణాన్ని సూచించేవి ఉన్నాయి. అందులో ఒకటి అల్ గఫూర్. అంటే క్షమించేవాడు అని అర్థం. అల్లాహ్ దయ, కరుణ, క్షమాగుణాన్ని వివరించే ఖుర్ఆన్ వాక్యాలు అనేకం ఉన్నాయి. అల్లాహ్ మనకు క్షమాభిక్ష ప్రసాదిస్తేనే మనకు శాశ్వతమైన మోక్షాన్ని పొందగలము. అల్లాహ్ క్షమాభిక్షను కోరుకునే వారు తమలాంటి మానవమాత్రులను కూడా క్షమించాలన్నది ప్రవక్త బోధనల సారాంశం. ఒకరినొకరు క్షమించుకోవడం ఇస్లామీయ సమాజంలో ఎంతో ముఖ్యం. 'చెడుకు ప్రతిక్రియ చెడు, కానీ ఎవరైతే మన్నించేస్తారో అలాంటి వారి ప్రతిఫలం అల్లాహ్ ప్రసాదిస్తాడు' అనే శుభవార్త అందిస్తుంది ఖుర్ఆన్.

## ఖుర్ఆన్ క్షమా గుణ బోధనలు...

"ఒకవేళ మీరు ప్రతీకారం చేస్తే కేవలం మీపై దౌర్జన్యం జరిగిన మేరకే ప్రతీకారం చెయ్యండి. కాని మీరు సహనం చూపితే, అది నిశ్చయంగా సహనం చూపేవారికే మంచిది." (16:126-127)

మీలోని ప్రముఖులు, స్థితిపరులు తమ బంధువులకూ, నిరుపేదలకూ, అల్లాహ్ మార్గంలో వలస వచ్చిన ప్రజలకూ, సహాయం చేయకూడదని ప్రమాణం చేయరాదు. వారిని

క్షమించాలి, వారి(తప్పులను)ని ఉపేక్షించాలి. మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే, ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను. (24:22)

## ముహమ్మద్ ప్రవక్త (స) క్షమాగుణం..

ఒకరోజు ప్రవక్త ప్రయాణంలో ఒక చెట్టుకు ఆనుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను హతమార్చడానికి ఇదే మంచి సమయమని ఒక శత్రువు చేతిలో కత్తితో ఆయన ముందుకు వచ్చి, “ఇప్పుడెవరు నిన్ను రక్షిస్తారని” కత్తి దూశాడు. అల్లాహ్ రక్షిస్తాడని ప్రవక్త చెప్పారు. ఇంతలో శత్రువు చేతిలో కత్తి జారిపోయింది. ప్రవక్త ఆ కత్తి తన చేతిలో తీసుకుని ఇప్పుడు నిన్నెవరు రక్షిస్తారని అడిగారు. ఆ వ్యక్తి వణుకుతూ “ఎవరు లేరు” అన్నాడు. ప్రవక్త అతనితో “తప్పు... నిన్ను కూడా అల్లాహ్‌యే రక్షిస్తాడని“ అన్నారు. ఆ వ్యక్తిని క్షమించి వదిలేశారు.

ప్రవక్త ముహమ్మద్(స)పై ఒక మహిళ చెత్త కుమ్మరించేది. ఆయన ఇంటి నుంచి మస్జిదుకు నడిచివెళ్ళే దారిలో ఆమె ఇల్లు ఉంది. ఇంటి పై కప్పు నుంచి ఆమె చెత్త ఆయనపై పోరేసేది. ఆయన మౌనంగా వెళ్ళిపోయేవారు, ఏమీ అనేవారు కాదు. ఒకరోజు ఆయన వెళుతున్నప్పుడు ఈ మహిళ కనిపించలేదు. ఆయన అక్కడ ఆగి ఆ మహిళ గురించి అక్కడి వారిని అడిగారు. ఆమె అనారోగ్యంతో మంచంపై ఉందని తెలిసింది. ప్రవక్త ముహమ్మద్ (స) ఆమె ఇంటికి వెళ్ళి ఆమెను పరామర్శించారు. ఆమెకు ధైర్యం చెప్పారు. ప్రవక్త వైఖరి ఆమెపై గొప్ప ప్రభావం వేసింది. క్షమా గుణం ఎంత గొప్పదో పై రెండు సంఘటనలు చాటి చెబుతున్నాయి. మన్నింపు వైఖరులను ముస్లిం సమాజం అలవర్చుకోవడమే ప్రవక్త (స) పట్ల ప్రేమకు నిదర్శనం.

## క్షమించడం సజ్జనుల లక్షణం

ఒక ముస్లిమ్ మృదు స్వభావి, సహనశీలి, విశాల హృదయుడయి ఉండాలి. తోటి సహచరుల పట్ల వాత్సల్యం, కరుణతో మసలుకోవాలి. సహచరుల తప్పిదాలను భరించాలి. సహించరాని మాటలనయినా విశాల హృదయంతో దాటవెయ్యాలి. విరోధులు ఎలాంటి కఠోర వచనాలు పలికినా, అభాండాలు వేసినా, బాధలు పెట్టినా, దౌష్ట్యాలకు పాల్పడినా చూపోవు వహించాలి. కాఠిన్యం, పాషాణ తత్వం, పరుష సంభాషణ, ప్రతీకారాగ్రహ స్వభావం - సగటు ముస్లిమ్‌కు శోభించవు. ఈ విషయాన్నే ప్రవక్త మహనీయులు(స) ఈ విధంగా వివరించారు: “నా ప్రభువు నన్ను ఇలా ఆదేశించాడు, ‘ఆగ్రహంలో ఉన్నా, ఆనందంలో ఉన్నా ఉభయావస్థల్లోనూ న్యాయవంతమయిన మాటే పలకాలి. నాకు దూరమయ్యే వారికి నేను చేరువవ్వాలి. నా హక్కు దక్కకుండా చేసే వానికి, అతను హక్కును అందజెయ్యాలి. నాపై దౌర్జన్యం జరిపిన వానిని నేను మన్నించాలి.” నిత్యజీవితంలో మనం తప్పుల మీద తప్పులు చేస్తూ ఉన్నప్పటికీ, అల్లాహ్ మనల్ని మన్నిస్తూనే పోతున్నాడు. ఉపాధినీ ఆపివేయడు, వరప్రసాదాలనూ దక్కకుండా చేయడు, మరి ప్రతి తప్పుకూ ఒక పిడుగుపాటు పడవేయడు. ప్రతీ ఒక్కరికీ సరిదిద్దుకునే వ్యవధినీ చాలినంతగా ఇస్తాడు. ఇది అల్లాహ్ నిగ్రహం, క్షమాగుణాల మహిమే. వారి అవగాహన కొరకు, మార్గదర్శకత్వం కొరకు ప్రవక్తల్ని, సంస్కర్తల్ని, ప్రబోధకుల్ని మాటిమాటికీ ప్రభవింపజేస్తూ ఉంటాడు. ఎవరయితే తన తప్పును తెలుసుకుని సన్మార్గాన్ని అవలంబిస్తారో వారి గత అపరాధాలను మన్నించివేస్తాడు. అల్లాహ్ క్షమించేవాడు, మన్నించేవాడు. అందువల్ల దాసులు కూడా శక్తి మేరకు, క్షమాగుణాన్ని అలవర్చుకోవాలి. విశ్వాసుల నైతిక ఆభరణాలు ఇవే, వారు సహనశీలురు, విశాల హృదయులు, సంయమన మనస్కులుగా మెలగాలి. ప్రతీకారం తీర్చుకునే శక్తి ఉన్నప్పటికీ క్షమించేయడం సజ్జనుల లక్షణమని ఖుర్‌ఆన్ పేర్కొంటోంది.

గాయాలను మాన్పడానికి, ప్రజల మధ్య సత్సంబంధాలను పునరుద్ధరించడానికి క్షమాగుణం అవసరం. మన మన వల్ల జరిగిన పాపాల మన్నింపు కోసం అల్లాహ్ పెట్టే క్షమాభిక్ష ఎంత అవసరమో, ఎదుటి వారిని క్షమించడమూ అంతే అవసరమని మనం గుర్తుంచుకోవాలి.



# ముహర్రమ్ ప్రాముఖ్యత

**ముహమ్మద్ గౌస్ ఖాన్**

సర్వ మానవుల మహోపకారి, చివరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) క్రీస్తు శకము 632 వ సంవత్సరం పరమ పదించారు. అప్పటి నుండి ఖలీఫాల పాలన ప్రారంభ మయింది. అప్పుడు ప్రజలు తమ ప్రతినిధిగా ప్రజాస్వామ్య పద్ధతిలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి)ని తొలి ఖలీఫా అంటే ప్రతినిధిగా ఎన్నుకున్నారు. వీరు క్రీస్తు శకము 632 నుండి 634 వరకు 2 సంవత్సరాలు పరిపాలన జరిపారు. వీరి తరువాత హజ్రత్ ఉమర్ (రజి అల్లాహు) క్రీస్తు శకం 634 నుండి 642 వరకు 8 సంవత్సరాలు, తరువాత హజ్రత్ ఉస్మాన్ (రజి అల్లాహు) గారు క్రీస్తు శకము 642 నుండి 654 వరకు 12 సంవత్సరాలు, ఆ తరువాత హజ్రత్ అలీ (రజి అల్లాహు) గారు క్రీస్తు శకము 654 నుండి 659 వరకు 5 సంవత్సరాలు పరిపాలన జరిపారు. ఈ నలుగురు ఖలీఫాలు ప్రాతినిధ్య పద్ధతి ప్రకారం ఎన్నుకో బడ్డారు.

వీరి పరిపాలనా కాలంలో సర్వత్రా న్యాయమే రాజ్యమేలింది. అన్ని రంగాలలో సమతూకం నెలకొని ఉండేది. వీరి పాలనా కాలం ప్రపంచ మానవ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచింది.

నలుగురు ఖలీఫాల పరిపాలన అనంతరం ప్రజలు తమ ప్రతినిధిగా హజ్రత్ ఇమాం హసన్ గారిని ఎన్నుకున్నారు. అప్పుడు సిరియా ప్రాంతానికి గవర్నరుగా ఉన్న హజ్రత్ ముఆవియా, కొందరు స్వార్థ నాయకుల సలహాల మేరకు అధికారం కోసం పోటీ పడ్డారు. ఫలితంగా ఇరువర్గాల మధ్య భీకర పోరు ప్రారంభ మయింది. ఇరు వర్గాలు ఖడ్గాలు చేత బట్టిన సోదరులను చూసి హజ్రత్ ఇమాం హసన్ గారి మనసు చలించి పోయింది. వెంటనే ఆయన తన స్పర్ధ నుండి వైదొలిగారు.

అలా ముఆవియా మనసులో నాటుకున్న రాజ్యకాంక్ష అనే విష బీజం పెరిగి పెద్దదై అధికార వ్యామోహంలో తన కుమారుడు యజీద్‌ను రాజుగా గుర్తించమని ప్రజలపై ఒత్తిడి తెచ్చాడు. ప్రజలు తమ ధన, ప్రాణ నష్టాల భయము వల్ల యజీద్‌ను కొంతమంది ప్రజలు రాజుగా గుర్తించారు. అలా ప్రాతినిధ్య వ్యవస్థకు పెద్ద గాయం ఏర్పడింది.

చాలా మంది రాజరికానికి ఎదురు తిరిగారు. ఇస్లాం ధర్మం ప్రకారం ఏ సమస్య కయినా చర్చలు, సంప్రదింపులే పరిష్కార మార్గాలు. కనుక ఇమాం హుసైన్ (రజి) ఆ మార్గాన్నే ఎన్నుకున్నారు.

ముఖాముఖి చర్చల కోసమని ఇమాం హుసైన్ (రజి) సిరియా రాజధాని "కుఫా" పట్టణానికి బయలు దేరారు. ఈ విషయం తెలుసుకున్న యజీద్ ఇమాం రాజధానికి చేరితే తన అధికారానికే ముప్పు వస్తుందని గ్రహించి, ఇమాం హుసైన్ (రజి) గారిని మార్గ మధ్యలో అడ్డుకోవడానికి ఓ పెద్ద సైన్యాన్ని పంపించాడు.

వేలల్లో ఉన్న యజీద్ సైన్యం ఇమాం హుసైన్ ను మార్గ మధ్యలోనే "కర్బలా" అనే మైదానము వద్ద అడ్డకుంది. 72 మందితో వెళ్తున్న ఇమామ్ గారి వెంట పిల్లలు, స్త్రీలు, వృద్ధులు కూడా ఉన్నారు. యజీద్ సైన్యాధికారి ఇమాం గారితో "మీరు యజీద్‌ను రాజుగా గుర్తించాలి." అని అన్నాడు. శాంత స్వభావుడైన ఇమాం హుసైన్ "నేను చర్చలు జరపడానికై వస్తున్నాను, నన్ను రాజధాని కుఫాకు వెళ్లనివ్వండి," అని అన్నారు.

కానీ, యజీద్ సైన్యాధిపతి ఈ మాటలేమీ పట్టించుకోకుండా యజీద్‌ను రాజుగా గుర్తించడమో లేక యుద్ధమో తేల్చుకో మన్నాడు. ఆశయ సాధన కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమే గాని, దౌర్జన్యపరులకు తలవంచను అని అన్నారు ఇమామ్ గారు. వెను వెంటనే ఇరువర్గాల మధ్య భీకర సంగ్రామం మొదల యింది. రోజులు గడుస్తున్నాయి. కర్బలా మైదానం రక్తంతో ఎర్రబారింది. కేవలం ధర్మసంస్థాపన కోసం ఇమాం హుసైన్ సైన్యం యజీద్ శత్రు సైన్యాన్ని ధీటుగా ఎదుర్కొంది.

రోజులు గడుస్తున్న కొద్ది ఇమామ్ గారి బృందానికి కష్టకాలం ప్రారంభమయింది. వారి హృదయాలు తల్లడిల్లిపోతున్నాయి. ఇమాం గారి సైన్యానికి మంచి నీళ్ళు ఇవ్వడానికి కూడా నిరాకరిం చారు. ఇమాం గారి సైన్యం ఒక్కొక్కరుగా అమరగతులవుతున్నారు.

ఇమాం హుసైన్ (రజి) గారి సైన్యం ఒక్కొక్కరుగా అందరూ అమరగతులయ్యారు. చివరకు ఇమాం హుసైన్ గారు ఒక్కరే మిగిలారు. అది ముహర్రం నెల పదవ రోజు శుక్రవారము.

ఇమాం హుసైన్ (రజి) గారు వేల సంఖ్యలో గల శత్రు సైన్యంతో పోరాడారు.

సూర్యుడు పడమటి దిక్కుకు వాలిపోయాడు. ఇమాం హుసైన్ గారు శుక్రవారము నాడు జుమా నమాజ్ ప్రార్థన కోసం శత్రువుల వద్ద కొన్ని నిమిషాలు అనుమతి తీసుకొని జుమా నమాజు ప్రార్థనలో నిమగ్నమయ్యారు. ప్రార్థన కోసం అనుమతి ఇచ్చిన ఆ శత్రువులు, ఇమామ్ హుసైన్ ప్రార్థన చేసుకొని తిరిగి వస్తే, తమ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోతాయని భావించి ఇమాం హుసైన్ గారిని బాణముతో హతమార్చారు. క్రీస్తు శకము 626లో జన్మించిన ఇమామ్ హుసైన్ గారు క్రీస్తు శకం 671వ సంవత్సరంలో ధర్మ సంస్థాపనా మార్గంలో అమరగతులయ్యారు.

షరీయత్ పునాది రాళ్ళు కదులుతున్నప్పుడు, ఓ మహోన్నత సంప్రదాయానికి ప్రాణం పోసిన త్యాగమూర్తి ఇమాం హుసైన్ (రజి). అమరగతులయి నేటికి 1353 సంవత్సరాలయినా ప్రపంచంలోని వారందరితోపాటు చరిత్ర కారులు కూడా వారిని గౌరవిస్తున్నారు. హజ్రత్ ఇమాం హుసైన్ (రజి) గారి త్యాగం వెల కట్ట లేనిది. వారి ఆ త్యాగాలకు గుర్తుగా మనం వారిని అమరగతి పొందిన వారుగా గుర్తు చేసుకుంటున్నాం.

**ఇస్లాం ధర్మంలో ముహర్రమ్ నెల పదవ రోజుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.**

- ముహర్రమ్ పదవ రోజును "ఆషురా" అని అంటాం.
- హజ్రత్ ఇమాం హుసైన్, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అమరగతులైందీ ఇదే రోజు.
- ఇస్లామీయ నూతన సంవత్సరము ముహర్రమ్ నెలతో ప్రారంభమవుతుంది.
- దేవుడు సర్వ సృష్టిని, భూమ్యా కాశాలను, స్వర్గ నరకాలను ఇదే రోజున పుట్టించాడు.
- హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) గారు ఇదే రోజున జన్మించారు. వారి పశ్చాత్తాపము, తౌబా కూడా ఇదే రోజున స్వీకరించ బడ్డాయి.
- హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) గారి కోసం నమ్రూద్ చక్రవర్తి ఏర్పాటు చేసిన పెద్ద అగ్ని గుండం ఇదే రోజున దైవాజ్ఞతో పూల ఉద్యానవనంగా మారిపోయింది.
- హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) ఇదేరోజున ఆకాశానికి పిలిపించుకోబడ్డారు.
- నేనే దైవం అని చెప్పిన దుర్మార్గ ఫిరౌన్ చక్రవర్తి ఇదే రోజున నడి సముద్రంలో ముంచి వేయబడ్డాడు.
- హజ్రత్ మూసా (అలైహిస్సలాం) గారికి సాఫల్యం లభించింది కూడా ఇదే రోజు.
- నూహ్ ప్రవక్తకు తుఫాను నుండి విముక్తి లభించింది కూడా ఇదే రోజు.
- "ఈ నెలలోని 9, 10వ తేదీలలో (లేదా) 10, 11వ తేదీలలో రెండు రోజులు నఫిల్ ఉపవాసాలు అంటే అదనపు ఉపవాసాలు పాటించడం ఉత్తమం" అని ప్రవక్త (స) తెలిపారు.
- మహాప్రవక్త ముహమ్మద్ (స) ఒక ప్రవచనములో- "ప్రళయము ఇదే రోజున అంటే ముహర్రమ్ నెల పదవ తేదీ శుక్రవారం రోజున వస్తుంది" అని తెలిపారు.

అల్లాహ్ మనందరికీ ఈ మాసపు విధి విధానాలను తెలుసుకొని నడుచుకునే సద్బుద్ధిని ప్రసాదించుగాక. (ఆమీన్)

**నేటికి** వందేళ్ల తరువాత 2121లో మనమూ మన ఇంటివారు, బంధుమిత్రులతో కలిసి భూగర్భంలో ఉంటాము. ఇప్పుడు మనం నివాసముంటున్న మన ఇళ్లల్లో ఎవరో అపరిచితులు ఉంటారు. మన ఆస్తులన్నీ మన వారసులు అనుభవిస్తుంటారు. వాళ్లు మనల్ని గుర్తుకూడా పెట్టుకోరు. అసలు మన గురించి కూడా వారికి తెలిసుండదు. ఇప్పుడు మన పరిస్థితి కూడా అలానే ఉంది. మన ముత్తాతలెవరో ఎంతమందికెరుక? వాళ్లెవరో, ఎలా ఉంటారో కూడా తెలియదు. వందేళ్ల తరువాత ఎవరు ఎవరినీ గుర్తుంచుకోరు. ఒక తరం ముగుస్తుంది. మృత్యుముఖంలోకి వెళ్లిపోయాక మనకు 'ఈ ప్రపంచాన్ని వీలయినంత ఎక్కువ పొందాలన్న అత్యాశ ఎంత మూర్ఖమైనదోనని. జీవితాన్ని మంచి పనుల్లో గడిపి ఉంటే ఎంత బావుండేది' అని కుమిలిపోతుంటాం. ఆ మంచి పనులేదో చేసే సమయం ఇప్పుడు మన చేతుల్లో ఉంది. సమయం చేయి దాటిపోలేదు. మన ఊపిరి ఉన్నంత కాలం ఈ అవకాశం ఉంది. మనం చేసే మంచి, చెడు అది ఎంత చిన్నదైనా, పెద్దదైనా ఆ రోజు మనం తప్పకుండా చూసుకుంటామని ఖుర్‌ఆన్ హెచ్చరిస్తుంది.

తరువాత ఎవడైనా రవ్వంత సత్కార్యం చేసి ఉన్నాసరే దాన్ని అతను చూసుకుంటాడు. అలాగే ఎవడైనా రవ్వంత దుష్కార్యం చేసివున్నాసరే దాన్నీ అతను చూసుకుంటాడు. (99:7-8)



# ముహర్రం అల్లాహ్ మాసం

## (సందేహాలు- సమాధానాలు)

సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**(గత సంచిక తరువాయి)**

ప్రశ్న: హ్జ్రత్ హుసైన్ (ర) గారి విశిష్ఠను గురించి తెలుపగలరా?

**జవాబు:** ప్రవక్త (స), హ్జ్రత్ హసన్, హ్జ్రత్ హుసైన్ (ర) గారిని ఎంతగానో ప్రేమించేవారు. హ్జ్రత్ హుసైన్ (ర), ప్రవక్త (స) వారికి దగ్గర పోలిక గలవారు. ఆయన (స) ఇద్దరిని గురించి అల్లాహ్‌తో దుఆ చేశారు: "ఓ అల్లాహ్! నేను వీరిద్దరిని ప్రేమిస్తు న్నాను. నువ్వు కూడా వీరిని ప్రేమించు". (ముస్నద్ అహ్మద్).

"వీరిద్దరూ నా ప్రాపంచిక ముద్దు మందారాలు" అని వేరొక సందర్భంగా ప్రవక్త (స) సెలవిచ్చారు. (బుఖారీ)

"ఇప్పుడు నా వద్దకు వచ్చిన ఈ దైవదూత ఇంతకు మునుపెన్నడూ భూలోకానికి దిగి రాలేదు. అతను నాకిచ్చిన శుభవార్త - ఫాతిమా(ర.అ) స్వర్గపు స్త్రీలకు నాయకురాలు. హసన్ మరియు హుసైన్ (ర) స్వర్గపు యువతకు నాయకులు" అని అన్నారు ప్రవక్త (స). (తిర్మిజీ)

ఓ సందర్భంగా ఆయన ఇరు భుజాల మీద ఇద్దరినీ కూర్చో బెట్టుకొని ఒకసారి హసన్ (ర)గారని, ఒక సారి హుసైన్ (ర) గారిని ముద్దాడుతుండగా చూసిన ఓ వ్యక్తి - "మీరు ఇంతలా వీరిరువురిని ఇష్టపడతారా? అని ప్రశ్నించగా- "వీరిద్దరిని ప్రేమించిన వ్యక్తి నన్ను ప్రేమించినట్లు. వీరిద్దరిని ద్వేషించిన వ్యక్తి నన్ను ద్వేషించినట్లు" అని సెలవిచ్చారాయన(స). (ముస్నద్ అహ్మద్)

ప్రశ్న: ముహ్రమ్ మాసంలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి శోకం పాటించడం, రోదించడం, గుండెలు బాదుకోవడం, కత్తులతో రక్తం వచ్చేలా కొట్టుకోవడం, బట్టలు చించుకోవడం ఎంత వరకు సబబు?

**జవాబు:** ప్రవక్త (స) ఇలా అన్నారు: "అజ్ఞాన కాలానికి చెందిన నాలుగు దురాచారాలు నా సముదాయంలో కూడా ఉంటాయి. జాతి (ప్రాంత, భాష) దురభిమానం, వంశాన్ని తూలనాడటం, నక్షత్రాల ద్వారా వర్షాన్ని కోరుకోవడం, గుండెలు బాదుకుంటూ ఏడ్వడం". (ముస్లిం) ఆ తర్వాత ఆయన ఇలా హెచ్చరించారు: "బట్టలు చించుకొని, గుండెలు బాదుకుంటూ, ముఖాన్ని రక్కుతూ రోదించే స్త్రీ మరణానికి ముందు వరకూ తౌబా చేసుకోకపోతే ప్రళయ దినాన ఆమెని తిరిగి బతికించి లేప బడినప్పుడు- ఆమెకు తారు వస్త్రాలు, గజ్జి వస్త్రాలు తొడిగించ బడిన స్థితిలో లేపడం జరుగుతుంది." (ముస్లిం)

వేరొక సందర్భంలో ఆయన ఇలా అన్నారు: "ముఖం మీద కొట్టుకునే వారు, బట్టలు చింపుకునే వారు, అజ్ఞాన కాలపు మాటలు మాట్లాడే వారు మాలోని వారు కారు". (బుఖారీ)

ప్రశ్న: ఈ మాతమ్ - శోక పరంపర ఎప్పుడు మొదలయ్యింది?

**జవాబు:** గుండెలు బాదుకొని, బట్టలు చింపుకొని, వెంట్రుకలు విరబూసుకొని శోకం పాటించడం అన్నది చాలా కాలంగా ఉన్న ఆచారం. ప్రవక్త (స) దాన్ని నిషేధించారు. ఆ తర్వాత అక్కడక్కడా ఇలాంటి చేష్టలు కనిపించినా, దానికి చట్టబద్ధతను కల్పించినది మాత్రం హిజ్రీ శకం 352లో అహ్మద్ బిన్ బువైహ్ అద్దయిలమీ అనే రాజు. ఆషూరా సందర్భంగా దుకాణాలు బందు చేయాలని, శోకాన్ని సూచించే నల్లటి వస్త్రాలు ధరించాలని, ముఖం మీద, గుండెల మీద కొట్టుకుంటూ శోక ప్రదర్శన చేయాలని, స్త్రీలు సయితం నల్లటి వస్త్రాలు ధరించి శోకాన్ని సూచించే కవితలు పాడుకుంటూ వీధుల గుండా వెళ్లాలని ఆదేశించాడు. వ్యతిరేకించిన వారిని శిక్షించాడు. తర్వాతి కాలంలో ఈ వికృత చేష్ట కొత్త పుంతలు తొక్కి, చిన్న, చిన్న పిల్లల్ని సయితం బ్లేడుతో కోసి ఆనందించే స్థాయికి చేరుకుంది. ఇవి చాలవన్నట్లు ముహర్రమ్ మాసం ప్రారంభం అవ్వగానే కొందరు స్నానం చెయ్యరు, స్త్రీలు తాము ధరించిన నగలను తీసేస్తారు, పొయ్యిని బోర్లా చేసి పెడతారు. నూతన వధువుని పుట్టింటికి సాగనంపేస్తారు. అల్లాహ్ అందరినీ ఇలాంటి దిక్కుమాలిన ఆచారాల బారి నుండి కాపాడుగాక! ఆమీన్.

ప్రశ్న: ఈ మాసంలో సమాధుల్ని అలంకరించడం జరుగుతుంది కదా?

**జవాబు:** సమాధుల్ని అలంకరించడం ఎప్పటికీ నిషిద్ధమే. ముహర్రమ్ మాసం మొదలవగానే ఖనన వాటికను శుభ్రపర్చడం, సున్నం పూయడం, అగరవొత్తులు, కొవ్వొత్తులు వెలిగించడం ప్రారంభం అయిపోతుంది. స్త్రీలు, పురుషులు, పిన్నలు, పెద్దలు అందరు ఖననవాటికకు వెళ్ళి ఒక మేళ లాంటి వాతావరణాన్ని సృష్టిస్తారు. సమాధుల దగ్గరికెళ్ళి అర్థిస్తారు. ఇవన్నీ షిర్క్, బిద్అత్ పనులు. ఇలాంటి వెకిలి చేష్టలు చోటు చేసుకుంటాయని తెలిసే ప్రవక్త (స) ఇలా వేడుకున్నారు: "ఓ అల్లాహ్! పూజింపబడే విగ్రహంగా నా సమాధిని చెయ్యకు. స్వామీ! ప్రవక్తల సమాధులను సజ్దా స్థలాలుగా చేసుకున్న జాతి యెడల అల్లాహ్ ఆగ్రహోదగ్రుడయ్యాడు". (మిష్కాతుల్ మసాబీహ్)

ప్రశ్న: ఈ సందర్భంగా రకరకాల వంటకాలు చేసి పంచడం ఎలాంటిది?

**జవాబు:** ప్రవక్త (స) ఇలా అన్నారు: "సలామ్‌ను సర్వవ్యాప్తం చెయ్యండి. అన్నదానాలు చేపట్టండి. బంధుత్వ సంబంధాలను బలపర్చండి. ప్రజలు ఆదమరచి నిద్రిస్తుండగా రాత్రి సమయాన మీరు లేచి నమాజు చెయ్యండి. ఇలా గనక మీరు చేస్తే స్వర్గంలో నిశ్చింతగా ప్రవేశిస్తారు". (ముస్నద్ అహ్మద్)

'అన్నదానానికి మించిన దానం లేదంటారు' పెద్దలు. అన్నదానం చాలా మహత్పూర్వక కార్యం - సందేహం లేదు. అయితే దాని కోసమంటూ కొన్ని రోజులను కేటాయించడం, కొన్ని రుతువులు, మాసాలతో దాన్ని ముడిపెట్టడం సమంజసం కాదు. కనుక ముహర్రమ్ సందర్భంగా హలీమ్, బిర్యానీ, మటర్ పులావ్, ఫిర్నీ, షర్బత్ వంటివి చేసి పంచడం, లేదా వాటిని దర్గాలకు తీసుకెళ్లి- పూర్వీకుల పేరున నజర్, నియాజ్ సమర్పించడం ముమ్మాటికీ గర్హనీయం.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

కథ

# పండుగలు – కొత్త కొత్త పోకడలు

- షహనాజ్ బేగం, అనంతపురం



**"అమ్మా.. ఈసారి మేము బక్రీద్ పండుగకు మన ఊరికి రావటం లేదు. పిల్లలకు పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షా సమయం. అందుకే ఇక్కడే హైదరాబాద్‌లోనే ఈద్ జరుపుకోవాలనుకుంటు న్నాము. మేము రావటం కుదరదు. వీలయితే మీరే ఇక్కడికి వచ్చేయండి. అందరం కలిసి చేసుకుందాం. మీరు ఒక్కరే ఊళ్లో ఈద్ చేసుకోవటమేమిటి?" అంటూ..**

నా కొడుకు నదీమ్ ఫోన్ చేసి చెప్పినప్పట్నుంచి నిరాశలోనూ, నిరుత్సాహంగానూ ఉండిపోయాను. ప్రతి సంవత్సరం రమజాన్, బక్రీద్ పండుగలకు రావటం, తమ స్వంత ఊరిలో స్వంత ఇంట్లో జరుపుకోవటం ఆనవాయితీ.

అలా వచ్చినప్పుడు ఇల్లంతా సందడే సందడి. వారి రాకమునుపే ఈద్‌కు కావల్సిన ఏర్పాట్లన్నీ జరిగిపోయేవి. వంటకు కావాల్సిన మసాలాలు, తీపి పదార్థాలు వంటివి అన్నీ ఇంట్లోనే తయారు చేసుకునేవారు. బంధుమిత్రుల పలకరింపులతో అంతా సందడిగా ఉండేది. ఆ ఆనందమే వేరు.

హైదరాబాద్‌లో కొడుకు నదీమ్ ఉద్యోగరీత్యా ఉంటున్నాడు. కోడలుకూడా చదువుకున్నది. ఆమె కూడా ఉద్యోగస్థురాలే. పిల్లలు ముగ్గురు. మంచి స్కూళ్ళలో చదువుకుంటున్నారు. కొడుకు కోడలు పిల్లల చదువుల పట్ల చాలా శ్రద్ధ వహిస్తుంటారు. వారి చదువుల కోసం వేల కొద్దీ డబ్బు ఖర్చు పెడుతుంటారు. ఏ విషయంలోనూ రాజీ పడరు.

పండుగకు ఊరికి వస్తే పిల్లల చదువులకు ఆటంకం కలుగుతుందని, వారి చదువుల దృష్ట్యా ఊరికి రావటంలేదని కొడుకు నిష్కర్షగా చెప్పెయ్యటంలో ఇక చేసేది లేక ఈద్ రెండు రోజులుందనగా హైదరాబాద్‌లో ఉండే కొడుకు ఇంటికి చేరుకున్నాను.

అక్కడ భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్థులు కావటం, పిల్లలు తమ స్కూల్, ట్యూషన్లు, క్లాసులతో బిజీగా ఉండడంతో అక్కడి వాతావరణం అదోలా ఉండేది.

ఈద్ కోసం పెద్దగా హడావుడి పడిపోవటం లేదు. ఏ తయారీలు చెయ్యటంలేదు. కేవలం బట్టల కోసమంటూ షాపింగ్‌లు చేస్తున్నారు.

ఒకరోజు కోడలిని పిలిచి, 'అమ్మాయ్, మసాలా కోసం తెల్ల ఉల్లి పాయలు, అల్లం తెప్పించు. నేను వాటిని వలిచి శుభ్రం చేసి మిక్సీలో వేసి మసాలా తయారుచేస్తాను' అని చెప్పాను.

అది విని కోడలు నా వంక విచిత్రంగానూ, విసుగ్గానూ చూస్తూ "ఇప్పుడవన్నీ ఎవరు చేసుకుంటారు అమ్మీ. బజారులో రెడిమేడ్ మసాలా దొరుకుతుంది. అది తెచ్చుకుందాము' అని చెప్పింది.

మా అత్తాకోడలు మాటలు విని నా కొడుకు నదీమ్ వచ్చి 'అమ్మీ, ఆ మసాలాను అప్పటికప్పుడు తయారుచేసి ఇస్తార్లే. పాత స్టాకు కాదు' అన్నాడు. నేను ఏమీ చెప్పలేక ఊరకుండిపోయాను.

మరుసటి రోజు బయటికి వెళ్తున్న నదీమ్‌ని ఆపి, "బేటా, ఈద్ రేపేగా. మరి ఖుర్బానీ బకరా ఇంకా ఇంటికి చేరలేదేమిటి' కనీసం రెండు మూడు రోజులయినా ఖుర్బానీ బకరాను ఇంట్లో పెట్టుకుని ప్రేమతో వాటిని మేపుతూ ఉండాలని అంటారు కదా" అని అడిగాను.

దానికి నదీమ్ నవ్వుముఖం పెట్టి, "అమ్మీ, ఈ అపార్ట్‌మెంట్‌లో అలా కుదరదు. మనమున్న అపార్ట్‌మెంట్‌లో అసలే కుదరదు. వాళ్ళు అనుమతించరు. అందుకే నేనొక ఏర్పాటు చేసుకున్నాను. కొంత పైకాన్ని వారికి జమచేస్తే బకరాను ఖుర్బానీ ఇవ్వటం వంటివి అన్నీ వాళ్ళే చూసుకుంటారు. ఖుర్బానీ మాంసాన్ని మనకు అందజేస్తారు. మనకెలాంటి ఇబ్బంది కానీ శ్రమ కాని ఉండదు" అన్నాడు.

నాకు ఆశ్చర్యమనిపించింది.

ఇది సర్దుబాటు తనమా? సంప్రదాయాలను. ధర్మాలను పక్కనపెట్టి తమకు అనుకూలంగా సౌకర్యవంతంగా మార్చుకోవటమా??

ఇంకా ఇంట్లో మరొక విషయం జరిగింది.

ఈద్ రోజున కనీసం రెండు తీపి పదార్థాలు చేసుకోవటం మా ఇంట్లో ఆనవాయితీ. అందుకే డబుల్‌కా మీఠా, ఖుబానీ కా మీఠా చేద్దామని తయారయ్యాను.

కానీ అక్కడా నా పని సాగనివ్వలేదు.

'ఫలానా బేకరీలో పసందైన మిఠాయిలు దొరుకుతున్నాయని జనం ఎగబడి కొంటున్నారని, అది తీసుకువస్తానని చెప్పి, వాటిని తెచ్చుకుని పండుగ అయిందనిపించారు.

మనిషి జీవితం ఎంత యాంత్రికమైపోయిందో అప్పుడర్థమయి పోయింది. ఒక సంతృప్తి లేదు, ఒక స్పందన లేదు. సుఖమయ మైన జీవితానికి అలవాటు పడ్డారు.

పిల్లలకు మన ధార్మిక విజ్ఞానాన్ని కలిగించాలన్న ధ్యాస లేదు. ఆ పిల్లలకు ధార్మిక జ్ఞానం కలిగించాలనే ఉద్దేశ్యంతో వారిని దగ్గర కూర్చొబెట్టుకుని బక్రీద్ పండుగ గురించి దాని విశిష్టత గురించి సంగ్రహంగా వివరించగలిగాను.

బక్రీద్‌ను ఈదుల్ అజ్హా అంటారని, అది ఒక త్యాగోత్సవం అని, ఇస్లాం ఐదు స్తంభాలలో హజ్ ఒకటి అని, హజ్ యాత్రను ఈనెల బక్రీద్‌లోనే నిర్వహిస్తారని, ఇబ్రాహీం(అ), ఇస్మాయీల్(అ) వారి త్యాగనిరతి గురించి వివరించి చెప్పాను. అల్లాహ్ ఆదేశం ప్రకారం ఇబ్రాహీం ప్రవక్త తన కుమారుడైన ఇస్మాయీల్(అ)ను బలి ఇవ్వటానికి తయారయి వెళ్ళే వృత్తాంతాన్ని వివరించాను. తరువాత కుమారుడి స్థానంలో ఒక పొట్టేలు రావటం, దానిని బలి ఇవ్వటం జరిగిందని, ఆ తండ్రి, కొడుకుల త్యాగాన్ని స్మరించుకుంటూ ఈదుల్ జుహా పండుగను జరుపుకుంటారని చెప్పాను.

పిల్లలు ఎంతో ఆసక్తిగా విన్నారు. వాళ్ళు ఇస్లామీయ విషయాలను తెలుసుకోవటం ఎంతో ఆవశ్యకత ఉందని గ్రహించాను.

కానీ వాళ్ళు తమ తమ ఫోన్ల ద్వారా గూగుల్‌లో అన్ని విషయాలను తెలుసుకుంటున్నారట.

ఏమిటో కాలం మారిపోతోంది. కాల గమనంలో ఎన్నో మార్పులు చేర్పులు. కాలానుగుణంగా మనమే మారాలి కాబోలు. పండగ అయిపోయి ఊరిలోని ఇంటికి చేరినా ఇవే ఆలోచనలు.

ఆధునికత పేరిట ఎన్నో మార్పులు. మనిషి తన సుఖమయమైన జీవితానికి అలవాటు పడి ఎన్నో సౌకర్యాలను అమర్చుకుంటు న్నాడు.

ఏది ఏమైనా నా కుటుంబీకులకు ఇస్లామీయ ధర్మాలను పాటించేలా, సంప్రదాయాలను గౌరవించేలా చెయ్యాలని, వాటి కోసం పాటుపడాలని నిశ్చయించుకున్నాను.


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# నిజామీ గజళ్లు

## (ఏడవ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ కవిత్వం)

- గీటురాయి డెస్క్

**(నవాబ్ నిజామత్ జంగ్ ఈ గజళ్ళను ఇంగ్లీషులోకి స్వేచ్ఛానువాదం చేశారు. The Ghazals of H.E.H.The Nizam పేరుతో ఈ ఇంగ్లీషు పుస్తకం 1919లో అచ్చయ్యింది. ఈ పుస్తకానికి స్వయంగా నిజామ్ మనవడు ప్రిన్స్ ముఫఖం జా ముందుమాట రాశారు. నిజామ్ వ్యక్తిత్వాన్ని, నిజామ్ కవితాభిలాషను అర్థం చేసుకోడానికి ఆ ముందుమాట ఎంతైనా తోడ్పడుతుంది. ప్రిన్స్ ముఫఖంజా రాసిన ముందుమాట ఆధారంగా నిజామ్ కవిత్వ పరిచయమిది)**

హైదరాబాద్ అండ్ బీరర్ సంస్థానాధీశుడు, ఏడవ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అనేక రంగాల్లో ప్రవేశమున్న ప్రజ్ఞాశాలి. ఆయన రాసిన కవిత్వం అనేకమందిని ఆకట్టుకుంది. ముఖ్యంగా యవ్వన ప్రాయంలో ఉర్దూ, ఫార్సీ భాషల్లో గజల్, నజ్మ్ ఇతర కవితా ప్రక్రియల్లో కవితలు రాశారు. ఈ కవితా ప్రక్రియల ఛందో లక్షణాలపై ఆయనకు మంచి పట్టు ఉండేది.

స్వతహాగా నిజామ్ చాలా నిశితమైన తెలివితేటలు కల వ్యక్తి. అద్భుతమైన జ్ఞాపకశక్తి కలిగినవాడు. రాజకుమారుడిగా అత్యుత్తమ స్థాయి విద్యాభ్యాసం ఆయనకు లభించింది. ఆయన మితభాషిలా కనబడేవాడు కాని, ఏ విషయం గురించైనా తడుముకోకుండా, ధారాళంగా మాట్లాడే వక్త. పాలకుడి హెూదాలో ఉన్నప్పటికీ చాలా సాధారణంగా, చాలా సామాన్యంగా జీవితం గడిపేవాడు. చాలా సున్నితమైన మనస్సు కలవాడని ప్రిన్స్ ముఫఖం జా ముందుమాటలో రాశాడు.

విద్యార్థి దశలోనే నిజామ్ సాహిత్యాభిలాష కలిగిన వ్యక్తి. సాహిత్యం పట్ల మక్కువ వల్ల ఆయనకు భాషపై తిరుగులేని పట్టు ఉండేది. ఆయన ఏది రాసినా అత్యంత క్లుప్తంగా, సరళంగా, స్పష్టంగా, రాసేవాడు. నిజామ్ గద్యశైలి అనుకరించడం ఇతరులకు సాధ్యపడేది కాదు. భాషపై ఉన్న ఈ పట్టు ఆయన కవిత్వంలోను కనబడుతుంది.

కవిత్వంలో ఆయనకు గురువు జలీల్. ఉర్దూలో గురువులేని కవి ఎవరు ఉండరు. ప్రతి కవి తన కవిత్వాన్ని గురువుతో

దిద్దించుకునే వాడు. గురువులేని కవిని బే ఉస్తాదీ అని తక్కువగా చూడడం జరిగేది. నిజామ్ గురువుగా వ్యవహరించిన జలీల్కు తర్వాత నవాబ్ ఫసాహత్ జంగ్ బిరుదుతో ఆయన సత్కరించాడు. భారతదేశానికి చెందిన గొప్ప కవుల్లో జలీల్ ఒకరు. మరో గొప్ప కవి అమీర్ మినాయీకి ఆయన శిష్యుడు. అమీర్ మీనాయి 1900లో హైదరాబాద్ వచ్చాడు. నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ తండ్రి నిజామ్ మీర్ మహబూబ్ అలీ పాషా అప్పుడు అధికారంలో ఉన్నారు. మీర్ మహబూబ్ అలీ పాషాకు ఎందువల్లనో అమీర్ మినాయీ నచ్చలేదు. హైదరాబాద్ వచ్చిన తర్వాత అమీర్ మినాయీ జబ్బుపడి మరణించాడు. ఆయన్ను నిజామ్ ఉస్మాన్ అలీ కలిసి ఉండే అవకాశం లేదు కాని, ఆమీర్ మినాయీ కవిత్వంతో నిజామ్కు పరిచయం లేదనలేము. నిజామ్ కవిత్వాన్ని చాలా ఇష్టంగా చదివేవాడు. పుస్తకపఠనంలో చాలా కాలం గడిపేవాడు. అనేకమంది ప్రముఖ కవులు హైదరాబాద్ పట్ల ఆకర్షితులు కావడానికి ఆయనే ముఖ్యమైన కారణం. హాలీ వంటి గొప్ప కవి కూడా హైదరాబాద్ పట్ల ఆకర్షితుడయ్యాడంటే నిజామ్ రాజుల కవిత్వ పోషణే కారణం.

ప్రముఖ ఉర్దూ కవి, ముగల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్కు గురువు దాగ్ తోను నిజామ్కు పరిచయం ఉంది. నిజామ్ తండ్రి మహబూబ్ అలీ పాషా కు దాగ్ కవిత్వ గురువు. దాగ్ ఢిల్లీ నుంచి హైదరాబాద్కు వలస వచ్చి చివరి 18 సంవత్సరాలు ఇక్కడే జీవించాడు. 1905లో ఆయన మరణించాడు. దాగ్కు ఫసీవుల్ ముల్క్ బిరుదుతో నిజామ్ తండ్రి సన్మానించాడు. గొప్ప కవులతో ఆయనకున్న పరిచయాలు ఆయన కవిత్వం మరింత పదునుతేలడానికి ఉపయోగపడ్డాయి.

అనేకమంది ప్రముఖ కవులతో పరిచయాలున్నప్పటికీ నిజామ్ తనదైన ప్రత్యేకశైలిలోనే రాసేవాడు. ఆయనపై ఎవరి ప్రభావాన్ని చూపించడం చాలా కష్టం. సాధారణంగా అప్పటి కవులు సాంప్రదాయికంగా వాడే ప్రతీకలను గాని, కవిత్వ అభివ్యక్తిని కాని ఆయన అనుసరించలేదు. ఆయన అభివ్యక్తిలో ఒక ప్రత్యేకత ఉండేది. కవిత్వ అభివ్యక్తి విషయంలో ఆయన రాజీపడలేదు. సాంప్రదాయిక భాషాపరిమితులను అవసరమైతే అధిగమించేవాడు.

కవిత్వంలో భావం చాలా ముఖ్యమైనది. ఒక వస్తువును ఎంచుకున్న తర్వాత, కవిత్వ అభివ్యక్తి ద్వారా ఆ వస్తువుపై కవి ఏ భావాన్ని చెప్పదలచుకున్నాడో అది చాలా ముఖ్యమైనది. కవిత్వ నిర్మాణం దానికి అనుగుణంగా ఉంటుంది. ఉర్దూ కవిత్వ సంప్రదాయంలో ప్రతి కవి ఒక గురువుకు శిష్యరికం చేసేవాడు. కవిత్వ నిర్మాణంలో మాత్రమే గురువు సహాయపడేవాడు. వస్తు ఎంపిక విషయంలోకాని, కవి హృదయంలోని భావం విషయంలో కాని గురువు కల్పించుకోవడం జరిగేది కాదు. నిజామ్కు మొదట గురువుగా జలీల్ ఉండేవాడు. జలీల్ ఆ కవితలను కాస్త మెరుగు దిద్దడానికి కొన్ని సూచనలివ్వడం తప్ప సాధారణంగా అంతకు మించి కవిత్వ నిర్మాణం విషయంలో కూడా కల్పించుకునే అవసరముండేది కాదు. నిజామ్ రాసిన కవిత్వమంతా ఆయన స్వంత అభివ్యక్తి.

చాలా మంది రాజులు కవిత్వం రాశారు. ఉర్దూలో ఒక కవితా సంకలనాన్ని దివాన్ అంటారు. ఒక దివాన్ లేదా రెండు దివాన్లు ప్రచురించిన వారున్నారు కాని నిజామ్ మాదిరిగా మూడు కవితా సంకలనాలు ప్రచురించిన రాజులు చాలా తక్కువ. నిజామ్ కవిత్వాన్ని అప్పటి దిగ్గజాలైన కవులతో పోల్చనూ లేము. కవులుగా స్థిరపడిన వారి కవిత్వ అభివ్యక్తికి నిజామ్ అభివ్యక్తికి చాలా తేడా ఉంది. ఆయన శైలి చాలా ప్రత్యేకమైనది. ఆయనపై ఎవరి ప్రభావమన్నా ఉందంటే అది ముగల్ చక్రవర్తి బాబర్ ప్రభావం ఉందని చెప్పాలి. ముగల్ చక్రవర్తి బాబర్ కూడా మంచి కవి అన్నది తెలిసిందే.

ఉర్దూ గజల్ రచనలో కవి తన పేరును, లేదా తన కలం పేరును కవితలో వాడుకోవడం సంప్రదాయం. అసదుల్లా ఖాన్ తన కవితల్లో గాలిబ్ అన్న కలంపేరు వాడుకున్నాడు. ముఖ్యంగా గజల్ ప్రక్రియలో రాసిన కవితల్లో ఇది స్పష్టంగా తెలుస్తుంది. బహదూర్ షా జఫర్ తన గజళ్ళలో జఫర్ అన్న పేరు వాడుకునేవాడు. గాలిబ్ కూడా మొదట్లో తన గజళ్ళలో అసద్ అన్న అసలు పేరునే వాడుకున్నాడు. మన కాళోజీ రామేశ్వరరావు గారు షాద్ అన్న పేరుతో రాసేవారు. ఇలా ఉపయోగించే కలం పేరు లేదా నామముద్రను తఖల్లుస్ అంటారు. నిజామ్ తన పేరులో "ఉస్మాన్" అన్న పదాన్ని తఖల్లుస్గా ఉపయోగించేవారు. ఆయన రాసిన అనేక గజళ్ళలో సూఫీతత్వం చదువరిని ఆశ్చర్యచకితుడిని చేస్తుంది. ముఖ్యంగా గజల్ ప్రక్రియలో ఉండవలసిన చమత్కారం చదువరి మనసులో ఒక మెరుపులా మెరుస్తుంది. ఆయన తన కవిత్వంలో తన సంతోషాన్ని, తన దు:ఖాన్ని, తన కోరికలను, తన విషాదాలను, తన భావాలను, తాను నమ్మే జీవిత సిద్ధాంతాన్ని, తన అనుమానాలను, తన

లోపాలను, తన ప్రేమలను, సూఫీతత్వాన్ని, తన వైఫల్యాలను అన్నింటిని రాసుకున్నాడు.

నిజామ్ కవితలు రాయడం ప్రారంభించినప్పుడే వాటిని ఇంగ్లీషు లోకి అనువదించాలని నవాబ్ సర్ నిజామత్ జంగ్ ను కోరాడు. సర్ నిజామత్ జంగ్ గొప్పగా చదువుకున్న వ్యక్తి. ఇంగ్లీషు, ఉర్దూ, ఫార్సీ భాషలపై తిరుగులేని ఆధిపత్యం కలవాడు. స్వయంగా ఫార్సీ, ఇంగ్లీషు భాషల్లో మంచి కవి కూడాను. సర్ నిజామత్ జంగ్ పట్ల నిజామ్కు ప్రత్యేకమైన గౌరవాదరాలు ఉండేవి. నిజామ్ కన్నా ఆయన 15 సంవత్సరాలు చిన్నవాడు. హైదరాబాద్‌లో ప్రాథమిక విద్య తర్వాత బ్రిటన్‌లో ఉన్నత విద్య అభ్యసించాడు. కేంబ్రిడ్జి ట్రినిటీ కాలేజిలో చదువుకున్నాడు. మిడిల్ టెంపుల్ బార్‌లో సభ్యుడు. హైదరాబాద్ తిరిగి వచ్చిన తర్వాత ఆయన సివిల్ సర్వీసులో చేరాడు. న్యాయ, పరిపాలన విభాగాల్లో ప్రతిభా వంతంగా సేవలందించాడు. హైకోర్టు జడ్జిగాను తర్వాత చీఫ్ జస్టిస్ గాను పనిచేశాడు. హెూం సెక్రటరీగాను, రాజకీయ విభాగానికి కార్యదర్శిగాను, ఎగ్జిక్యుటివ్ కౌన్సిల్‌లో మంత్రిగాను ఆయన పనిచేశాడు.

నవాబ్ సర్ నిజామత్ జంగ్ గొప్ప మేధావి. మంచి కవి. 1918లో ఆయన ఇంగ్లీషు కవిత్వం ఇంగ్లాండ్లో ప్రచురించబడింది. ఆయన రాసిన సొనెట్లను టైమ్స్ లిటరరీ సప్లిమెంట్ ప్రశంసలతో ముంచెత్తింది. ఇంగ్లీషు సాహిత్యంలో తనదైన స్థానం సంపాదించుకున్న కవి ఆయన. నిజానికి సర్ నిజామత్ జంగ్ రచనావ్యాసంగంలో నిజామ్ గజళ్ళ అనువాదం అనేది చాలా చిన్న అధ్యాయం. అది కూడా నిజామ్ కోరికపై ఆయన అనువాదానికి పూనుకున్నాడు.

నిజామత్ జంగ్ మాటల్లో చెప్పాలంటే : "తన గజళ్ళను కొన్నింటిని ఇంగ్లీషులోకి అనువదించాలని నిజామ్ నన్ను కోరి, తన కవితల మూడు సంపుటాలను నాకు కానుకగా పంపారు.. వాటిని చదివిన తర్వాత.. నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఒక గొప్ప పాలకుడే కాదు, భావుకుడు, మేధావి కూడా అని అర్థం చేసుకున్నాను. ఆయన కవిత్వం ఇతర భాషల ప్రజలకు కూడా అందాలని భావించాను.

"ఇంగ్లీషులోని అనువదించమని నన్ను కోరడం నాకు చాలా సంతోషమైంది. కాని ప్రాచ్య కవితా అభివ్యక్తిని, ప్రతీకలను, కవిత్వ నిర్మాణాన్ని పాశ్చాత్య ఇంగ్లీషు అభివ్యక్తిగా మార్చడం చాలా కష్టం. అందువల్ల నేను ఇంగ్లీషు కవితారీతులను అనుసరిస్తూ, కాస్త లిరికల్ టోన్ సాధిస్తూ, ఆయన గజళ్ళలోని భావాన్ని ఇంగ్లీషులోకి స్వేచ్ఛానువాదం చేశాను. ఈ అనువాదాన్ని అందరూ మెచ్చుకోవడం నాకు చాలా ఆనందమయ్యింది."

ఈ అనువాదం చూసి నిజామ్ చాలా సంతోషించాడు. అందంగా ముద్రించిన బౌండు కాపీలను తన సన్నిహిత మిత్రులకు పంపించాడు.

నిజామ్ 1921లో లార్డ్ హార్డింగ్‌కు ఒక లేఖరాశాడు. నవాబ్ నిజామత్ జంగ్ అనువదించిన తన కవితలను కొన్నింటిని హార్డింగ్‌కు పంపించాడు. తన కవితల గురించి ఆయనకు రాస్తూ "..... ఇవన్నీ ఉర్దూలో ఉన్నాయి. అది మీ భాష కాదు. ఉర్దూ మాతృభాషగా ఉన్నవారు మాత్రమే ఉర్దూ కవిత్వంలోని మాధుర్యాన్ని, సౌందర్యాన్ని అర్థం చేసుకోగలరు. మీకు అది సాధ్యం కాదు. అందువల్ల నేను రాసిన కొన్ని గజళ్ళ ఇంగ్లీషు అనువాదాన్ని మీకు పంపిస్తున్నాను. ఉర్దూలో ఉన్న భావాన్ని, అర్థచ్ఛాయలను, అందాన్ని సాధ్యమైనంత వరకు ఇంగ్లీషులో కూడా కనిపించేలా చేసిన అనువాదం ఇది..." అని చెప్పాడు.

ఇంగ్లీషు అనువాదంలో కూడా నిజామత్ జంగ్ ఇంగ్లీషు భాషకు తగిన కవిత్వ నిర్మాణంతో చేసిన అనువాదం ఉర్దూ కవిత్వానికి మాత్రమే ప్రత్యేకమైన అద్భుతమైన ప్రతీకలను, పదచిత్రాలను మనకు అందిస్తుంది.

ఉదాహరణకు:

ఆమె నిట్టూర్పుల మంటలనుంచి కొన్ని అగ్గిరవ్వలు పైకి లేచాయా,

వాటి వల్ల స్వర్గం గుండెలో నిప్పు పెట్టినట్లుంది. ఆకాశం మండుతున్నట్లు ఎర్రబడింది.

నా హృదయగాథ చెప్పాలని అనుకున్నాను

పదాలు పెదాలపైనే ప్రాణం విడిచాయి.

దట్టమైన మబ్బులను చీల్చుకుని ప్రకాశించే సూర్యకిరణాల్లా

విషాదాల గుట్టలను చీల్చుతూ నా గుండెగాయం ప్రకాశిస్తుంది

ఏడవ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ వ్యక్తిత్వంలోని సరికొత్త కోణాన్ని పరిచయం చేసే గజళ్ళు ఈ పుస్తకంలో ఉన్నాయి. నవాబ్ నిజామత్ జంగ్ ఇంగ్లీషు అనువాదానికి బదులు, ఒరిజినల్ గా రాసిన ఉర్దూ నుంచి ఆ గజళ్ళను తెలుగులోని అనువదిస్తే ప్రపంచ సాహిత్యంలో నిజామ్ రాసుకున్న పుటలను మనం కూడా చదువుకోవచ్చు.

# సమాధి పిలుస్తోంది!

- ముహమ్మద్ వహీదుద్దీన్

**ఒకరోజు** మహాప్రవక్త(స) నమాజ్ చేయడానికి మస్జిద్‌లోనికి ప్రవేశించారు. అక్కడ కొందరు విరగబడి నవ్వుతుండగా చూశారు. అప్పుడు ఇలా బోధించారు. మీరు కోరికల్ని హరించివేసేదాన్ని అధికంగా స్మరిస్తూ ఉన్నట్లయితే అది మిమ్మల్ని ఇలా నవ్వనిచ్చేది కాదు– అది మృత్యువు. మృత్యువును అధికంగా స్మరించండి అది సమస్త వాంఛల్ని చంపివేస్తుంది. సమాధి ప్రతిదినం చాటుతూ ఉంటుంది. నేను సత్రం లాంటి గృహాన్ని, ఏకాంత కుహారాన్ని, బురదమట్టి నిలయాన్ని, పురుగులకు పుట్టినిల్లును అని. ఒక విశ్వాసి సమాధిలో పూడ్చబడినప్పుడు, సమాధి అతనికి స్వాగతం పలుకుతుంది. నా వెన్ను (భూమి)పై నడిచిన వారిలోకెల్లా నీవు నాకు ఎంతో ప్రియమైనవాడవు. ఈ వేళ నీవు నాకు అప్పగించ బడ్డావు. నీ ఎడల ఎంత మంచిగా ప్రవర్తిస్తానో చూస్తావుగా! అని మహాప్రవక్త(స) ఇలా అన్నారు. అతని కోసం సమాధి విశాలం చేయబడుతుంది. అక్కడ స్వర్గం వైపునకు ఒక ద్వారం తెరవబడు తుంది. అలాగే ఒక దురాచారుడు, దుర్మార్గుడు లేక అవిశ్వాసిని పూడ్చినప్పుడు భూమి అతనికి స్వాగతం పలకదు. సమాధి ఇలా అంటుంది. నా వెన్నుపై నడిచిన వారిలోకెల్లా నీవు నాకు అమితంగా అయిష్టమైనవాడివి. ఇప్పుడు నీవు నాకు అప్పగించబడ్డావు. ఇక నిన్ను ఎలా సాధిస్తానో చూస్తావుగాని! అని. మహాప్రవక్త(స) ఇలా అన్నారు : అతనికి ఆ సమాధి ఇరుకయిపోతుంది. ఎంత ఇరుకవు తుందంటే అతని ప్రక్కటెముకలు ఒకదానిలో ఒకటి చొచ్చుకు పోతాయి. ఈ మాట చెబుతూ మహాప్రవక్త(స) ఒక చేతి వ్రేళ్ళను మరో చేతి వేళ్ళలో వేసి చూపెట్టారు. ఇంకా ఇలా అన్నారు : ఆ తరువాత అతనిపై డెబ్బై మహా విష సర్పాలు వదలబడతాయి. అవి ఎంతో విషపూరితమై ఉంటాయి. వాటిలో ఏ ఒక్కటి పృథ్విపై ఒక్కసారి బుసకొట్టినా భూమి శాశ్వతంగా బీడువారిపోతుంది. ఇలాంటి విష సర్పాలు అతన్ని కాటువేస్తాయి. తీర్పుదినం వచ్చేవరకు ఇది ఇలా సాగుతూనే ఉంటుంది. సమాధి మనిషికి స్వర్గపు ఉద్యాన వనాల్లో ఒకటిగానో, నరక కూపాల్లో ఒకటిగానో రూపొందుతుంది. (తిర్మిజీ)

హదీసులో ఇహలోక జీవితం– పరలోక జీవితం మధ్య నుండే మరణావస్థకు సమాధి సంకేతంగా ప్రయోగించటం జరిగింది.

ఒక వ్యక్తి ప్రపంచంలో తనకు సాధ్యపడినంత వరకు చెడుతో పోరాడుతూ మంచిని ఆచరిస్తూ, పరలోక సాఫల్యం కొరకు కృషి చేస్తూ తన జీవితాన్ని చాలించుకున్నాడంటే సమాధిలో అతని ఎడల ప్రేమపూర్వకంగా వ్యవహరించటం జరుగుతుంది. అలాకాక ఒక వ్యక్తి జీవితాంతం చెడును ఆచరిస్తూ పశ్చాత్తాపపడకుండా, క్షమాపణ వేడుకోకుండా మరణిస్తే సమాధిలో శిక్షాపూరితమైన వాతావరణంలో ఉండవలసి ఉంటుంది. అంటే సమాధిలోని జీవితాన్ని తన ఆచరణ మూలంగానే మలచుకోగలడన్న మాట. అదే మాటను హదీసు చివరిలో చెప్పడం జరిగింది.


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# చాడీలు

**- మదీహా అర్జుమంద్**

ఒకరిపై ఒకరికి చాడీలు చెప్పడం, ఇతరులపై నిందలు వేయడం కొంత మందికి అలవాటు. చాడీలు, నిందల వల్ల భయానకమైన దుష్పరిణామాలు సంభవించే అవకాశాలు ఉంటాయి. కాని కొంతమంది ఇవేమీ పట్టించుకోకుండా ఒకరిపై ఒకరికి చాడీలు చెప్పి, నిందలు వేసి పైశాచికానందం అనుభవిస్తుంటారు.

ఒక వ్యక్తిని గురించి, అతడి చర్యల గురించి ఇతరుల ముందు ప్రస్తావించడం, 'నింద'లు మోపడం వల్ల గౌరవ మర్యాదలకు భంగం కలుగుతుంది. ఆత్మగౌరవం దెబ్బతింటుంది. నిందల వల్ల మనసుల్లో విద్వేషపు బీజాలు రాజుకుంటాయి. దీని ఫలితంగా కొన్ని సందర్భాల్లో భయానక ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. అందుకే 'నింద'ను మహా పాపంగా పేర్కొంటూ, 'మృత సోదరుని మాంసం భక్షించడం'తో సమానంగా అభివర్ణించాయి ఖురాన్, హదీసులు.

అలాగే పరోక్షనింద. ఇది ఇంతకన్నా మహా పాపం. ఒక మనిషికి ఎటువంటి చెడుతో గాని, పాపంతో గాని సంబంధం లేకపోయినా వాటిని ఆ మనిషికి ఆపాదించడాన్ని, అతనిపై లేనిపోనివి కల్పించి చెప్పడాన్ని 'పరోక్షనింద' అంటారు. ఇలా పరులపై పరోక్ష నిందలు మోపేవారిని దేవుడూ క్షమించడు.ప్రజలూ క్షమించరు. దేవుని దృష్టిలో, ప్రజల దృష్టిలో వారు పరమ దుర్మార్గులు.

ప్రవక్త మహనీయులు ఇలా ప్రవచించారు: 'హృదయాల్లో ఈమాన్ సారం దిగకుండా, నోటి మాటగా విశ్వసించిన జనులారా! విశ్వాసులపై నిందలు వేయకండి. కనబడని వారి దోషాల వెంట పడకండి. ఎవరైతే ఇలా చేస్తారో, అల్లాహ్ కూడా వారి పట్ల అలానే వ్యవహరిస్తాడు. ఎవరిపట్లనైతే దైవం ఇలా వ్యవహరించాడో, (ఇక చూడండి) వారిని వారి గృహాల్లోనే పరాభవం పాలు చేస్తాడు.'

అంటే ఇతరులపై నిందలు మోపడం, వారి తప్పులు, బలహీనతల వెంటపడి కూపీలు లాగడం కపటులు చేసే పని. కపట విశ్వాసులు మాత్రమే ఇలాంటి దుస్సాహసాలకు తెగబడతారు. అందుకే వారు కేవలం 'నోటితో మాత్రమే విశ్వాస వచనం పలికారని, నామమాత్రపు విశ్వాసులని, విశ్వాససారం వారి హృదయాల్లో దిగనే లేదని, వారిలో మానవత్వం ఏ కోశానా లేదని ప్రవక్త మహనీయులు చెప్పారు.

ఇంకా ఆయన(స) ఇలా అన్నారు: 'నేను మేరాజ్ యాత్రకు వెళ్ళినప్పుడు, అక్కడ కొంతమంది నాకు తారసపడ్డారు. వారి గోళ్ళు ముదురు ఎరుపు రంగులోని రాగి గోళ్ళలా ఉన్నాయి. వాటితో వారు తమ ముఖాలను, ఎదుర్రొమ్ములను గీరుకొని రక్తసిక్తం చేసుకొంటున్నారు. అప్పుడు నేను, 'వీళ్ళెవరు? ఇంతటి భయంకరమైన శిక్ష అనుభవిస్తున్నారు?' అని జిబ్రీల్ (అ)ను అడిగాను.

'వీళ్ళు తమ ఇహలోక జీవితంలో ప్రజల మాంసాన్ని భక్షించేవారు. అంటే, పరులపై నిందలు వేసేవారు, అపనిందలు మోపే వారు, వారి గౌరవ మర్యాదలతో చెలగాట మాడేవారు' అని చెప్పారు జిబ్రీల్.

కొంతమందికి ఇతరులను నిందించడం, రకరకాల కామెంట్లు చేయడం, వారి పరోక్షంలో ఉన్నవి, లేనివి ఊహించుకొని, కల్పించుకొని చెప్పుకోవడం ఒక కాలక్షేపం. అదొక పైశాచిక ఆనందం. ఇతరుల విషయంలో నోరెత్తే హక్కు తమకు లేదన్న ఇంగితం కూడా వారికి ఉండదు. దానివల్ల వారికి ఎంత అపార నష్టం జరుగుతుందో వారు ఆలోచించలేక పోతారు. దైవం మనకు నోరెందుకిచ్చాడు? ఇతరుల్ని తిట్టడానికా, నిందించడానికా? బుద్ధిజ్ఞానాలను ఎందుకు ప్రసాదించాడు? ఇతరులను గురించి చెడుగా, దుర్మార్గంగా ఆలోచించడానికా? మనసులో రేకెత్తే ఆలోచనల విషయం కూడా రేపు దైవం ప్రశ్నిస్తాడు. నోటి నుండి వెలువడే ఒక్కొక్క మాటకు, చేసే ఒక్కొక్క పనికి దైవానికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. నోటికొచ్చినంత మాట్లాడ తామంటే కుదరదు. పరుల మనసు గాయపరిచే వారిని దైవం ఎంత మాత్రం క్షమించడు. చేతనైతే నాలుగు మంచి మాటలు మాట్లాడాలి. మంచి ఆలోచనలు కలిగి ఉండాలి. చేయగలిగితే మేలు చేయాలి. లేకపోతే మౌనంగా ఉండాలి. మనసులో ఏమాత్రం కుళ్ళు, కుట్ర, కాపట్యం, దుర్మార్గపు ఆలోచనలు ఉన్నా దేవుని ఆగ్రహానికి గురికాక తప్పదు. ఇటువంటి వైఖరిని ప్రజలూ సహించరు. సమాజమూ హర్షించదు. కనుక కొన్నాళ్ళ ఈ ప్రాపంచిక జీవితంలో మనసును కల్మషాలతో నింపుకొని, పైశాచిక ఆనందం అనుభవిస్తే, శాశ్వతంగా దుర్భర శిక్షను అనుభవించవలసి ఉంటుందని గ్రహించాలి. దైవం అందరికీ మంచి మనసును ప్రసాదించాలని, మంచి, పరోపకార భావన తప్ప మరో దురాలోచన మనసులో రాకుండా రక్షించాలని కోరుకుందాం.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**